ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత శనివారం గరిష్ఠం : 32.0 కనిష్ఠం : 24.0

ANDHRAJYOTHY 5



శ్రీ సత్యసాయి జిల్లా వార్తలు

ఆదివారం 15 జూన్ 2025

నీట్‌గా మెరిశారు

సత్తా చాటిన ఉమ్మడి జిల్లా విద్యార్థులు

ఆయా కుటుంబాల్లో వెల్లివిరిసిన సంబరం



ధనుష్

అనంతపురం టౌన్/ సెంట్రల్/హిందూపురం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): నీట్-2025 (నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రెన్స్ టెస్ట్)లో అనంత విద్యార్థులు సత్తా చాటారు. దేశవ్యాప్తంగా 23లక్షల మందికిపైగా విద్యార్థులు ఈపరీక్షలు రాయగా, ఫలితాలు శనివారం విడుదల చేశారు. ఇందులో జిల్లాకు చెందిన విద్యార్థులు మెరుగైన ర్యాంకులు సాధించారు.

పురం విద్యార్థికి 103వ ర్యాంకు

దేశవ్యాప్తంగా వైద్య కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ ఫలితాల్లో హిందూపురం విద్యార్థి ధనుష్ సత్తాచాటాడు. ఏకంగా ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 103వ ర్యాంకు సాధించాడు. పట్టణానికి చెందిన (మిగతా 7లో...)

ప్రమాదపు అంచులు..!

● రక్షణ దిమ్మెలు లేని కల్వర్టు ● తరచూ ప్రమాదాలు

ముదిగుబ్బ నుంచి పులివెందులకు వెళ్లే దారిలో దొరిగల్లు సమీపాన మద్దిలేరు కల్వర్టుపై ప్రయాణం ప్రమాద భరితంగా మారింది. కల్వర్టుపై రక్షణ దిమ్మెలు నిర్మించకపోవడంతో తరచూ వాహనాలు మద్దిలేరులో పడిపోతున్నాయి. రాత్రిళ్లు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. ఈ మార్గంలో పులివెందుల, బెంగళూరు మధ్య భారీ వాహనాలు అధికంగా వెళ్తుంటాయి. లారీలు ఎదురుగా వచ్చినపుడు ఆటోలు, మినీ వ్యాన్లు, ట్రాక్టర్లు, ప్రైవేటు స్కూల్ బస్సులు, ఇతర వాహనాలు కల్వర్టు అంచుల వరకు వెళ్లాల్సి వస్తుంది. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి సమయాల్లో ద్విచక్రవాహనదారులు అదుపుతప్పి ఎంతోమంది గాయాలపాలయ్యారు. గతంలో పులివెందుల నుంచి బెంగళూరు వెళ్తున్న సిమెంటు లారీ దొరిగల్లు కల్వర్టు అంచులో అదుపుతప్పి బోల్తా పడింది. రెండేళ్ల క్రితం భారీ వర్షాలకు కల్వర్టు కొట్టుకుపోయింది. తాత్కాలిక మరమ్మతులు చేయించినా, రక్షణ దిమ్మెలు ఏర్పాటు చేయలేదు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రతిపాదనలతోనే సరిపెడుతున్నారని, రక్షణ దిమ్మెలను ఏర్పాటు చేయట్లేదని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

\- ఆంధ్రజ్యోతి, ముదిగుబ్బ



రక్షణ దిమ్మెలు లేని కల్వర్టు

ప్రతిపాదనలు పంపాం

దొరిగల్లు కల్వర్టుపై రక్షణ దిమ్మెలు ఏర్పాటు చేసేలా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు రాగానే పనులు చేయిస్తాం.

\- వన్నూరుస్వామి, ఆర్‌అండ్‌బీ ఏఈఈ



రక్షణ దిమ్మెలు లేకపోవడంతో మద్దిలేరులో పడిపోయిన సిమెంటు లారీ (ఫైల్)

కొత్త చరిత్ర..!

విద్యార్థులకు తొలిరోజే విద్యాసామగ్రి

వందశాతం పంపిణీ చేసిన ప్రభుత్వం

విద్యార్థులు, తల్లిదండ్రుల ఆనందం



బండ్లపల్లిలో విద్యార్థినులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

కొత్తచెరువు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): పాఠ్య పుస్తకాల పంపిణీలో రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది రికార్డు సృష్టించింది. జిల్లాలోని 2060 ప్రభు త్వ పాఠశాలలు, 76 ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు విద్యాసంవత్సరం ఆరంభంలోనే పాఠ్యపుస్తకాలను 100 శాతం అందజేసింది. విద్యార్థులు పుస్తకాల కోసం గత ప్రభుత్వంలో పడిన ఇబ్బందులు ఈ ఏడాది నుంచి పడకూడదని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఈ నేపథ్యంలోనే సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్రా పథకాన్ని తీసుకొచ్చా రు. ఇందులో భాగంగా పాఠశాలలు పునఃప్రారంభం కాకనే జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు నేరుగా పాఠ్యపుస్తకాలతో పాటు, నోట్ బుక్కులు, వర్క్ బుక్కులు తదితర విద్యా సామగ్రిని సరఫరా చేశారు.

ఇంటర్ విద్యార్థులకు నీట్, ఎంసెట్ మెటీరియల్

ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులు నీట్, ఎంసెట్ పోటీ పరీక్షల్లో రాణించాలన్న లక్ష్యంతో తొలిసారిగా జిల్లాలోని 7,264 మంది ఇంటర్ విద్యార్థులకు సంబంధిత మెటీరియల్‌ను ప్రభుత్వం అందజేసింది. గత ప్రభుత్వం ఇంటర్, ఒకేషనల్ విద్యార్థులకు కనీసం పాఠ్యపుస్తకాలు అందించిన చరిత్ర లేదు. దీంతో తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడేది. ఈనేపథ్యంలో విద్యార్థుల చదులకు ఆటంకం కాకూడదన్న లక్ష్యంతో ఉచితంగా పాఠ్యపుస్తకాలతోపాటు, నోట్ బుక్కులు, వర్క్ బుక్కులు ప్రభుత్వం అందజేసింది. దీంతో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు బ్యాగులు తప్పా మిగిలిన ఒక జత బూట్లు, రెండు జతల సాక్సులు, మూడు జతల యూనిఫామ్, బెల్టు అందించారు. విద్యార్థులకు మొదటి సెమిస్టర్‌కు సంబంధించి పాఠ్యపుస్తకాలు 553317, వర్క్‌బుక్కులు 119037, నోట్ బుక్కులు 822660 అందజేశారు. మిగతా ప్రభుత్వ కళాశాలలకు వంద శాతం విద్యా సామగ్రిని అందజేశారు. ఈ పాఠ్యపుస్తకాలకు క్యూఆర్‌కోడ్‌ను ముద్రించి, పక్కదారి పట్టకుండా చర్యలు చేపట్టారు. బుక్కులు మార్కెట్‌లో విక్రయిస్తే సులువుగా గుర్తించేలా స్టిక్కర్‌ను సైతం ఏర్పాటు చేశారు.



రైతు ఇంట్లో నిల్వ ఉన్న వక్క బస్తాలు

నిరీక్షించినా.. నిరాశే..!

పాపం.. వక్కరైతు. ఏడాదిపాటు నిరీక్షించినా.. ఫలితం దక్కలేదు. గతేడాది వక్క ధరల్లేక ఇళ్లలోనే నిల్వ ఉంచుకున్నారు. ఈసారి ధరలు ఆశాజనకంగా ఉండడంతో అమ్ముకుందామని వక్కలను బయటకు తీయగా.. సైజు తగ్గాయి. దీంతో మార్కెట్‌లో తక్కువ ధరకే అడుగుతున్నారని వాపోతున్నారు. దిగుబడి, ధరల్లేక రెండేళ్లుగా వక్క రైతులు నష్టపోతున్నారు. గతేడాది గిట్టుబాటు ధరలు లేకపోవడంతో చాలామంది రైతులు వక్కను ఇళ్లలోనే నిల్వ ఉంచుకున్నారు. ఈసారి ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. గతేడాది క్వింటా రూ.40వేల నుంచి రూ.45 వేల వరకు అమ్ముడుపోయాయి. ప్రస్తుతం రూ.50వేల నుంచి రూ.58 వేలదాకా ధరలు పలుకుతున్నాయి. నిల్వ చేసుకున్న వక్కను అమ్ముకుందామని బయటకు తీస్తే.. ఎండలకు సైజు తగ్గినట్లు గుర్తించారు. దీంతో వాటిని వ్యాపారులు తక్కువ ధరకే అడుగుతున్నట్లు రైతులు చెబుతున్నారు. ఏడాది నిరీక్షించినా, ఈసారి ధరలు బాగున్నా.. తక్కువ ధరకే విక్రయించుకోవాల్సి రావడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

వక్క రైతుకు తప్పని నష్టం

గతేడాది ధరలేక ఇళ్లలోనే నిల్వ

ఈసారి బాగున్నా.. సైజు తగ్గిన వక్కలు

తక్కువకే అమ్ముకోవాల్సిన దుస్థితి

మడకశిర/అమరాపురం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన నియోజకవర్గంలో 7 వేల ఎకరాల్లో రైతులు వక్క పంట సాగు చేశారు. ఏటా రూ.100 కోట్లదాకా వక్క లావాదేవీలు జరుగుతాయి. స్థానికంగా మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో కర్ణాటకకు వెళ్లి విక్రయించుకోవాల్సి వస్తోంది. గతేడాది ధరలు దక్కలేదు. దీంతో చాలా మంది రైతులు పంటను ఇళ్లలోనే ఉంచుకున్నారు. ఈసారి నాణ్యతను బట్టి వక్క క్వింటా ధర రూ.58 వేల వరకు పలుకుతోంది. నిల్వ చేసిన పంటను మార్కెట్‌కు తీసుకెళ్తే ఎండలకు సైజు తగ్గిపోయిందంటూ వ్యాపారులు తక్కువ ధరకే అడుగుతున్నారని రైతులు వాపోతున్నారు. వారి అడిగిన రేటుకే విక్రయించాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. స్థానికంగా మార్కెట్ సౌకర్యం కల్పిస్తే రవాణా ఖర్చులు తగ్గడంతో పాటు దళారుల బెడద కూడా ఉండదని రైతుల అంటున్నారు. ఇప్పటికే అమరాపురం వద్ద మార్కెట్ యార్డు, వక్క ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. త్వరగా పూర్తి చేసి, ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



ఎండలకు సైజు తగ్గిన వక్కలు



ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలి

పదెకరాల్లో వక్క సాగు చేశా. గతేడాదితో పోల్చుకుంటే ఈసారి దిగుబడి దారుణంగా ఉంది. ధరలు బాగున్నా.. దళారుల చేతిలో మోసపోవాల్సి వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం వక్క మార్కెట్, ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలి.

\-రైతు మంజునాథ్, నాగేవనహళ్లి

ధర పెరిగినా లాభం లేదు

గత రెండేళ్లు ధరల్లేక నష్టపోయాం. పంటను ఇళ్లలోనే నిల్వ ఉంచుకున్నాం. ఈసారి ధరలు బాగున్నాయి. వక్కలు సైజు తగ్గాయంటూ వ్యాపారులు తక్కువ ధరకు అడుగుతున్నారు. దీంతో ధర పెరిగినా రైతుకు లాభం దక్కట్లేదు.

\-రైతు రాజ్‌కుమార్, కెంకర



హమ్మయ్య.. గొలుసు దొరికింది..



టీచర్‌కు గొలుసు అందజేస్తున్న కండక్టర్

కదిరిఅర్బన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఓ ఉపాధ్యాయురాలు పోగొట్టుకున్న బంగారు చైన్‌ను ఆమెకు అప్పగించి తన నిజాయతీని చాటుకున్నాడు కండక్టర్ సుధీంద్ర. వివరాలు ఇలా ఉన్నాయి.. కదిరి పట్టణానికి చెందిన దిల్‌నవాజ్‌ఖాన్ అమడగూరు మండలంలోని తుమ్మల హైస్కూల్‌లో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. విధుల్లో భాగంగా శుక్రవారం కదిరిలో బిళ్లూరుకు వెళ్తున్న బస్సు ఎక్కి, తుమ్మల వద్ద దిగారు. పాఠశాలకు వెళ్లి చైన్ పోయిన విషయం గుర్తించారు. బస్సులో ప్రయాణికులు బిళ్లూరు వద్ద దిగి వెళ్లిన తరువాత బస్సులోని సీటు కింద పడి ఉన్న చైన్‌ను కండక్టర్ గుర్తించి తన వద్ద ఉంచుకున్నాడు. బస్సు తిరుగుప్రయాణంలో తుమ్మల వద్ద టీచర్ బస్సును ఆపి కండక్టర్‌కు విషయం తెలిపారు. ఆమె చెప్పిన వివరాలు తెలుసుకుని చైన్ ఆమెదేనని నిర్ధారించుకున్న తరువాత అప్పగించారు. కండక్టర్ నిజాయతీని ప్రయాణికులు అభినందించారు.

దండిగా ఆదాయం

అనంత మార్కెట్ యార్డులో పశువుల సంతకు ఆదరణ

ఏడాదిలో రూ.2.06 కోట్ల రాబడి

అనంతపురంరూరల్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్‌కు పశువుల సంత ద్వారా ఆదాయం పెరుగుతోంది. మార్కెట్ ఫీజు లక్ష్యానికి దోహదపడుతోంది. మార్కెట్‌కు చీనీ మార్కెట్, పశువుల సంతే ఆదాయ వనరులు. మార్కెట్‌లోని గదులకు సంబంధించిన బాడుగలు ఉన్నప్పటికీ పెద్దగా ఆదాయం రాలేదు. ఉన్న ఈ రెండు వనరులే ఏటా మార్కెట్‌కు రూ.కోట్లలో తెచ్చిపెడుతున్నాయి. సీజన్‌తో సంబంధం లేకుండా ఆదాయం తెస్తున్నాయి. గత ఏడాది పశువుల ద్వారా రూ.2.06 కోట్లు ఖజానా వచ్చి చేరింది. దీన్ని బట్టి పశువుల సంత నుంచి ఆదాయం ఏమేరకు ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి గొర్రెలు, మేకల సంత ద్వారా రూ20.41 లక్షలు, ఎద్దులు, ఎనుముల సంత ద్వారా రూ.14.57 లక్షలు మార్కెట్‌కు సమకూరింది.

ఐదేళ్లలో రూ.7.56 కోట్లు..

ప్రతి శని, ఆదివారాల్లో పశువుల సంత జరుగుతుంది. శనివారం గొర్రెలు, మేకల సంత నిర్వహిస్తారు. ఆదివారం ఎద్దులు, ఎనుముల సంత ఉంటుంది. సంతకు ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు, వ్యాపారులు వస్తుంటారు. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ తదితర రాష్ట్రాల నుంచి కూడా వ్యాపారులు వస్తారు. ఈక్రమంలో అనంత వ్యవసాయ మార్కెట్ ఇతర ప్రాంతాల్లోనూ పేరొందింది. మార్కెట్ యార్డుకు ఏటా పశువుల సంత నుంచి (మిగతా 7లో..)

అనువుగాని చోట ఇళ్లు

జగనన్న కాలనీల్లో ముందుకు సాగని నిర్మాణాలు

సౌకర్యాలు లేక ఇబ్బందుల్లో లబ్ధిదారులు





తూపల్లి కాలనీలో అరకొరగా ఇంటి నిర్మాణాలు, గాండ్లపెంట జగనన్న లేఅవుట్‌లో రోడ్డు కూడా లేని దుస్థితి

గాండ్లపెంట, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ప్రతిపేదవాడికి సొంతిల్లు కట్టుకోవాలన్నదే లక్ష్యం. వైసీపీ ప్రభుత్వంలో అర్హులైన పేదలందరికి ఇల్లు కట్టించి చేతికి తాళాలిస్తామని గొప్పగా చెప్పారు. ఇల్లు కట్టుకున్న లబ్ధిదారులు అప్పులు మిగిలాయని ఆవేదన చెందుతున్నారు. గ్రామాలకు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రభుత్వ స్థలాలైన కొండ, గుట్టలను గుర్తించారు. మండల వ్యాప్తంగా 265 మంది లబ్ధిదారులను గుర్తించి, కొండ,గుట్టల్లో స్థలాలను ఇచ్చారు. నాయకులు కూడా వెంటనే పూర్తిస్థాయిలో నిర్మాణాలు చేసి, జగనన్న కాలనీల్లో రోడ్లు, విద్యుత్, తాగునీరు, మురుగునీటి కాలువలు తదితరసౌకర్యాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అనువుగాని చోట ఇంటి నిర్మాణానికి లబ్ధిదారులు మొగ్గు చూపకపోవడంతో.. ఇల్లు నిర్మించకపోతే స్థలాలను రద్దు చేస్తామని హెచ్చరించారు. దీంతో కొంతమంది పునాదులు, బేస్‌మట్టం వరకు నిర్మాణం చేపట్టారు. చామలగొంది పంచాయతీలో 15 ఇళ్లకు గాను ఒక్క ఇల్లు కూడా పూర్తికాలేదు. గాండ్లపెంట, కటారుపల్లి పంచాయతీల్లో 102 ఇళ్లు మంజూరై కాగా.. 38 మాత్రమే పూర్తిస్థాయిలో నిర్మించారు. సోమయాజులపల్లిలో 25 ఇళ్లకు 11, గొడ్డివెలగల 14కు గాను 5, కురుమామిడిలో 14కు గాను 3, మల్లమీదపల్లిలో 19గాను 5, తూపల్లి 29గాను 1, తుమ్మలబైలు 15కుగాను 7, వేపరాల 22కుగాను 5 ఇళ్లు పూర్తిచేశారు. ఇందులో జీనులకుంటకు 6, చామలగొంది 15 ఇళ్లు మంజూరుకాగా, ఒకటి కూడా కట్టలేదు. మొత్తం 265కుగాను 74 ఇళ్లు మాత్రమే పూర్తి చేశారు.

116 మంది లబ్ధిదారులు నిర్మాణాలకు ముందుకురాలేదు. మిగిలినవి వివిధ దశల్లో అర్థాంతరంగా ఆగిపోయాయి. గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఇల్లు నిర్మాణం చేపట్టాలంటే కూలీల రవాణా ఖర్చులతోపాటు, నిర్మాణ సామగ్రిని తరలించడానికి తలకు మించిన భారమవుతోందని లబ్ధిదారులు వాపోతున్నారు. గాండ్లపెంటకు రెండు కిలోమీటర్ల దూరంలోని జగనన్న కాలనీకి ఎలాంటి రహదారి లేదు. దీంతో లబ్ధిదారులు సిమెంటు, ఇసుక, కంకర, తరలించడానికి ఇబ్బందిగా ఉండడంతోపాటు నీరు కొనుగోలు చేయడానికి అధిక భారమవుతోందని చాలా మంది మధ్యలోనే నిర్మాణాలు నిలిపివేశారు. కటకంవారిపల్లి వద్ద ప్రభుత్వ భూమిలో బేస్‌మట్టాలు వేసి, ఒక్క ఇల్లు మాత్రమే పూర్తి చేశారు.

కనీస సౌకర్యాలు లేవు



వైసీపీ ప్రభుత్వ హయాంలో మా గ్రామం నుంచి రెండు కిలో మీటర్ల దూరంలో ఇల్లు మంజూరు చేశారు. నానా కష్టాలు పడి అప్పులు చేసి ఇంటి నిర్మాణం పూర్తి చేశా. దాదాపు రూ.12 లక్షలు ఖర్చు చేశా. రుణాలు ఇప్పిస్తామని, మౌలిక వసతులు కల్పిస్తామని నాయకులు హామీ ఇచ్చారు. గ్రామానికి దూరంగా లేఅవుట్ ఉండడంతో రుణం ఇవ్వలేదు. కనీస సౌకర్యాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

\-రెడ్డెమ్మ, కటారుపల్లి క్రాస్

వసతులు కల్పిస్తాం

జగన్న కాలనీల్లో ఇంటి నిర్మాణాలు పూర్తి చేస్తే మౌలిక వసతులు కల్పిస్తాం. త్వరలో రోడ్లు, వీధి లైట్లు ఏర్పాటు చేయడానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతాం. అనుమతులు వచ్చిన వెంటనే సౌకర్యాలు ఏర్పాటు చేస్తాం.

\-శ్రావణి, ఏఈ, గృహ నిర్మాణశాఖ

ఊరికి దూరంగా స్థలాలు ఇచ్చారు



వైసీపీ ప్రభుత్వం అనువుకాని చోట ఇంటి పట్టాలు ఇచ్చింది. జగనన్న లేఅవుట్‌లో దాదాపు 75 మంది ఇళ్లు పూర్తి చేశారు. మౌలిక వసతులు లేకపోవడంతో చాలా మంది నివాసాలు రావడానికి భయపడుతున్నారు. చుట్టూ కొండలు, గుట్టలు, ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు ఉన్నాయి. ఏ సమయంలో ప్రమాదం జరుగుతుందో అని ఆందోళనగా ఉంది. ప్రస్తుత ప్రభుత్వం, నాయకులు స్పందించి కాలనీలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలి.

\-కమలమ్మ, కటారుపల్లి

అలరించిన శతవర్ష స్వరమాధురి



భక్తిగీతాలు అలపిస్తున్న సాయిభక్తులు

పుట్టపర్తిరూరల్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మండపంలో తెలంగాణ రాష్ట్రం నిజామాబాద్ జిల్లాకి చెందిన భక్తులు అలపించిన శతవర్ష స్వరమాధురి భక్తిగీతాలు మంత్రముగ్ధులను చేశాయి. తెలంగాణ రాష్ట్రం నిజామాబాద్‌కు చెందిన 1000 మంది సాయిభక్తులు శనివారం పర్తియాత్రగా ప్రశాంతినిలయం చేరుకున్నారు. ఉదయం వేదపఠనం అనంతరం శతవర్ష స్వరమాధురి పేరిట పాడిన పాటలు భక్తులను అలరింపజేశాయి. అనంతరం శ్రీసత్యసాయి అష్టోత్తర శతనామావళిని పఠించారు. సాయంత్రం వేదపఠనం చేశారు. మహామంగళహారతి అనంతరం భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. రాత్రి పట్టణంలో వెండి రథరంపై సత్యసాయి చిత్రిపటాన్ని ఉంచి మంగళహారుతులు, తలపై జ్యోతులతో నృత్యం చేస్తూ నగర సంకీర్తన అట్టహాసంగా నిర్వహించారు.



నగర సంకీర్తన నిర్వహిస్తున్న నిజామాబాద్ జిల్లా భక్తులు

24న మెగా జాబ్‌మేళా

ధర్మవరం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక సీఎస్‌బీ కల్యాణ మండపంలో ఈనెల 24న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరీశ్‌బాబు శనివారం ప్రకటనలో తెలిపారు. 50కిపైగా కంపెనీలు పాల్గొంటాయన్నారు. 2వేలకుపైగా ఉద్యోగావకాశాలు కల్పిస్తాయన్నారు. వివరాలకు 9603232977 నంబరులో సంప్రదించాలన్నారు.

ప్రేమ పెళ్లి చేసుకుందని...

కుమార్తెను కిడ్నాప్ చేసిన తల్లిదండ్రులు

కళ్యాణదుర్గం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పెళ్లి చేసుకుందని కన్న కూతురినే తల్లిదండ్రులు కిడ్నాప్ చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. బెళుగుప్ప మండలం తగ్గుపర్తికి చెందిన ఉపాధ్యాయురాలు అదే గ్రామానికి చెందిన వ్యక్తిని ప్రేమించి గత నెలలో వివాహం చేసుకున్నారు. దీన్ని ఆమె తల్లిదండ్రులు అంగీకరించలేదు. ఎలాగైనా భర్త నుంచి ఆమెను వేరు చేయాలని భావించారు. ఈ క్రమంలోనే ఈనెల 12న ఆమె విధులు నిర్వహించే కంబదూరు మండలంలోని కురాకుల పల్లి ప్రభుత్వ పాఠశాల వద్దకు చేరుకుని కాపుకాశారు. ఇది తెలియని ఉపాధ్యాయురాలు భర్తతో కలిసి ద్విచక్రవాహనంపై పాఠశాలకు వచ్చారు. అప్పటికే అక్కడ కాపుగాసిన తల్లిదండ్రులు భర్తను తోసేసి కుమార్తెను బలవంతంగా వాహనంలో ఎక్కించుకుని తీసుకెళ్లారు. ఈ విషయమై అదేరోజు టీచర్ భర్త కంబదూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఈ నెల 13 న కేసు నమోదు చేశారు. కంబదూరు, కళ్యాణదుర్గం పరిధిలోని పోలీసులు 10 మంది బృందంగా ఏర్పడి టీచర్ ఆచూకీ కోసం గాలించారు. బెంగళూరు పరిసర ప్రాంతంలో టీచర్ ఆచూకీ లభ్యమైన ట్లు సమాచారం. టీచర్‌ను ఆస్తి కోసమా లేక వ్యక్తిగత కారణాలతో కిడ్నాప్ చేశారా అనే వివరాలు తెలియాల్సి ఉంది. టీచర్‌ను కిడ్నాప్ చేసిన దుండగులు కూడా పోలీసులు అదుపులో ఉన్నట్లు సమాచారం. కంబదూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనాలు ఢీ

ఒకరి మృతి, మరొకరికి తీవ్రగాయాలు

గోరంట్ల, జూన్14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హిందూపురం ప్రధాన రహదారిలో హెచ్‌పి పెట్రోల్ బంక్ వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని బూగానిపల్లికి చెందిన నంజుండప్ప గోరంట్లకు ద్విచక్రవాహనంలో వస్తుండగా ముద్దలకుంటపల్లికి చెందిన ప్రకాష్ ద్విచక్రవాహనంలో వస్తున్నాడు. వీరి వాహనాలు ఎదురెదురుగా గోరంట్ల పెట్రోలు బంకు సమీపంలోకి ఢీకొన్నాయి. దీంతో నంజుండప్ప(52) అక్కడికక్కడే మృతిచెందగా ప్రకాష్‌కు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ప్రకాష్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. సీఐ శేఖర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాస్ కాలేదని యువతి ఆత్మహత్య

అనంతపురం క్రైం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఫెయిల్ అయిన సబ్జెక్టులు మూడేళ్లుగా రాస్తున్నా పాస్ కాకపోవడంతో మనస్తాపం చెందిన ఓ యువతి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు నగరంలోని అశోక్‌నగర్ రెండో క్రాస్‌కు చెందిన నాగలింగయ్య, లక్ష్మీదేవి దంపతులకు నలుగురు కుమార్తెలు. లక్ష్మీదేవి 2015లో మృతి చెందింది. చివరి కుమార్తె సునీత(25) మదనపల్లి మిట్స్ కళాశాలలో మూడేళ్ల కిందట బీటెక్ చదివింది. కొన్ని సబ్జెక్టులు ఫెయిల్ కావడంతో వాటిని రాస్తూ వస్తోంది. అయినా ఫలితం లేదు. ఈ క్రమంలో గత కొంతకాలంగా తనతో పాటు చదివిన విద్యార్థులు చదువులో, ఉద్యోగాలతో ముందుకెళ్లారని, తాను మాత్రం ఉన్న చోటే ఉన్నానని బాధపడేది. చీనీకాయల వ్యాపారం చేసే నాగలింగయ్య శుక్రవారం ఉదయం బయటకు వెళ్లాడు. ఇంట్లో సునీత, మానసిక స్థితి సరిగా లేని ఆమె అక్క మాత్రమే ఉన్నారు. మధ్యాహ్న సమయంలో సునీత తన ఇంట్లోని ఓ గదిలో ఉరివేసుకుంది. శుక్రవారం రాత్రి ఇంటికొచ్చిన నాగలింగయ్య ఉరికి వేలాడుతున్న కుమార్తెను చూసి కన్నీరు మున్నీరయ్యాడు. ఈ ఘటనపై వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కంకర మెషీన్‌లో భారీ పేలుళ్లు

కంపించిన ఇళ్లు.. భయపడ్డ ప్రజలు

కళ్యాణదుర్గం, జూన్14(ఆంధ్రజ్యోతి): కళ్యాణదుర్గం పరిసర ప్రాంతంలో దేవేంద్రపురం వద్ద ఉన్న కంకర్‌మెషీన్‌లో శుక్రవారం సాయంత్రం జరిగిన పేలుళ్ల ధాటికి ఆ ప్రాంత ప్రజలందరూ భయభ్రాంతులకు గురయ్యారు. భారీ శబ్దానికి ఇళ్లన్నీ కంపించిపోయాయి. దేవేంద్రపురంతో పాటు పలు గ్రామాల పరిధి వరకు ఆ భీకర శబ్దం వినిపించింది. ఈ కంకర మెషీన్‌లో ప్రతిసారి ఇలాగే భయంకరమైన పేలుళ్లు జరుగుతున్నప్పటికీ ఏ ఒక్క అధికారి స్పందించలేదని గ్రామస్థులు వాపోతున్నారు. కళ్యాణదుర్గానికి వెళ్లే ప్రధాన రహదారిలోనే ఈ కంకర మెషీన్ క్వారీ ఉన్నప్పటికీ ఇక్కడ నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా పనులు చేస్తున్నా ఏ ఒక్కరూ పట్టించుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఈ కంకర మెషీన్‌లో పేలుళ్లను అరికట్టాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.

మతపెద్ద పరారీ..

గాలిస్తున్న పోలీసులు

అనంతపురం క్రైం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): బాలికను గర్భవతిని చేసిన ఓ మతపెద్ద పరారయ్యాడు. అనంతపురం రూరల్ మండల పరిధిలోని నారాయణపురానికి చెందిన మహమ్మద్ ఫయాజ్ మత పెద్దగా ఉంటున్నాడు. పిల్లలు లేని ఇతను తన బావమరిది కుమార్తెను పెంచుకుంటున్నాడు. ఆ చిన్నారిని చూసుకోవడానికి తన బంధువుల ఇంట్లో ఉంటున్న ఓ బాలికను పిలిపించాడు. గత కొంతకాలంగా ఆ బాలికకు మాయమాటలు చెప్పి శారీరీకంగా వాడుకున్నాడు. భయ పెట్టడంతో ఆ బాలిక ఈ విషయాన్ని ఎవరికీ చెప్పలేదు.

కడుపునొప్పితో ఆసుపత్రికి వెళ్తే..

కొన్ని నెలలుగా నెలసరి రాకపోవడంతో భయపడిన బాలిక తల్లికి విషయం చెప్పింది. మూడు రోజుల కిందట తల్లి ఆ ఇంటికి వచ్చింది. కడుపునొప్పిగా ఉందని ఆసుపత్రికి తీసుకెళ్తామని బాలిక తల్లి ఫయాజ్‌తో చెప్పింది. దీంతో ఆమెపై మండిపడ్డాడు. 'నేనే చూపిస్తాను కదా నీకెందుకు ఊరెళ్లిపో' అన్నాడు. అలా రెండ్రోజులు బుకాయించాడు. కానీ మూడోరోజు బాలిక తల్లి కమలానగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి బాలిక గర్భం దాల్చినట్లు నిర్ధారించారు. దీంతో అబార్షన్ చేయమని అడగ్గా అక్కడి వైద్యురాలు తాము చేయ లేమని చెప్పారు. పోలీసులకు సమాచారం అందించకుండా ప్రభుత్వాసుపత్రికి రెఫర్ చేశారు. ప్రభుత్వాసుపత్రికి బాలికను తీసుకెళ్లగానే మహిళా పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. పోలీసులు రంగంలోకి దిగగానే ఫయాజ్ పరారయ్యాడు. పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలిస్తున్నారు.

దండిగా ఆదాయం..!


సంతలో గొర్రెలు, మేకలు

(5వ పేజీ తరువాయి)

ఆదాయం పెరుగుతోంది. గత ఐదేళ్లలో రూ.7.56 కోట్ల ఆదాయం ఖజానాకు చేరింది. గత ఏడాది ఒక్కటే రూ.2.06 కోట్లు సంత రూపంలో వచ్చింది.

గొర్రెలు, మేకల సంతతో అధిక ఆదాయం

మార్కెట్‌లోని పశువుల సంత ద్వారా వచ్చే ఆదాయంలో.. గొర్రెలు, మేకల సంత ద్వారానే ఎక్కువగా సమకూరుతోంది. గడిచిన ఐదేళ్లలో ఎద్దులు, ఎనుముల సంత ద్వారా రూ3.04 కోట్లు, గొర్రెలు, మేకల సంతతో రూ.4.52 కోట్ల ఆదాయం వచ్చింది. 2020-21 ఆర్థిక సంవత్సరంలో మాత్రమే కొంత తగ్గింది. కరోనా నేపథ్యంలో మార్కెట్‌ను ఏడు నెలలు మూసేశారు. ఈక్రమంలో రూ.69.45లక్షలు మాత్రమే ఆదాయం వచ్చింది. మళ్లీ 2022-23లో లంపీ వ్యాధి ప్రబలిన నేపథ్యంలో నాలుగు నెలల పాటు ఎద్దులు, ఎనుముల సంతను బంద్ చేశారు. ఆ ఏడు కొంత ఆదాయం తగ్గింది. ఈ రెండు మినహా.. మిగిలిన ప్రతి ఏటా ఆదాయం ఆశాజనకంగా ఉంది.

ఆదాయం మరింత పెంచేందుకు చర్యలు



ప్రస్తుతం పశువుల సంత ద్వారా మార్కెట్‌కు ఆదాయం బాగానే ఉంది. ఈ క్రమంలో మార్కెట్‌లో మరిన్ని వసతులు కల్పించి, మరింత ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పశువుల సంత నిర్వహణకు స్థలం సమస్య ఏర్పడింది. సంత జరిగే ప్రాంతంలో దెబ్బతిన్న నాలుగు గోదాములు ఉన్నాయి. అవి నిల్వలకు ఉపయోగ పడే పరిస్థితి లేదు. ఈ క్రమంలో గోడలను తొలగించి పశువులకు వినియోగించాలని నిర్ణయించాం. ఆ మేరకు ఉన్నతాధికారులకు నివేదించాం.

-గోవిందు, మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి

తమ్ముడిని హత్య చేసిన అన్న


నడిపి కంబగిరి (ఫైల్)

పుట్లూరు, జూన్14(ఆంధ్రజ్యోతి): ఆస్తి తగాదాలతో తమ్ముడిని సొంత అన్నే గొంతు కోసి, హత్య చేశాడు. అనంతపురం జిల్లా పుట్లూరు మండల కేంద్రంలో శనివారం తెల్లవారుజామున తలారి నడిపి కంబగిరి (40)ని అతడి అన్న పెద్ద కంబగిరి చంపేశాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెద్ద కంబగిరి, నడిపి కంబగిరి, చిన్నకంబగిరి అన్నదమ్ములు. వీరికి పుట్లూరులో మూడు సెంట్లలో ఇల్లు ఉంది. నడిపి కంబగిరి అనంతపురం జిల్లా తాడిపత్రిలోని నందలపాడుకు కొన్నేళ్ల క్రితం వెళ్లి, అక్కడే స్థిరపడ్డాడు. అప్పుడప్పుడూ స్వగ్రామానికి వచ్చి వెళ్తుండేవాడు. పుట్లూరులోని ఇంట్లో పెద్దకంబగిరి తన భార్య కోసం చిన్నగది కట్టించాడు. దీనిపై నడిపి కంబగిరి గొడవ పడేవాడు. ఇల్లు తన భార్య పేరున రాయించాలంటూ అన్నపై ఒత్తిడి తెచ్చేవాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం స్వగ్రామానికి వచ్చిన నడిపి కంబగిరి రాత్రి అన్నతో గొడవ పడ్డాడు. పోలీసులు వచ్చి ఇద్దరికీ సర్దిచెప్పారు. అయినా దీనిని భరించలేక నడిపి కంబగిరి రాత్రికి ఆ ఇంట్లోనే నడిపి కంబగిరి పడుకున్నాడు. గొడవ నేపథ్యంలో ఆవేశానికి లోనైన పెద్దకంబగిరి కత్తితో నిద్రిస్తున్న తమ్ముడి గొంతుకోశాడు. అతడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. అనంతరం నిందితుడు నేరుగా పోలీసు స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయినట్లు సమాచారం. నడిపి కంబగిరి భార్య నారాయణమ్మకు మతిస్థిమితంగా లేదు. పిల్లలు లేరు. హత్యాస్థలాన్ని సీఐ సత్యబాబు, ఎస్‌ఐ వెంకటనరసింహులు పరిశీలించారు. కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నీట్‌గా మెరిశారు

(5వ పేజీ తరువాయి)

చింతపండు వ్యాపారి రాజేష్, రేణుకాంబ దంపతుల పెద్దకుమారుడు ధనుష్ ఎల్‌కేజీ నుంచి 2వ తరగతి వరకు పట్టణంలోని చిన్మయ పాఠశాలలో చదివాడు. 3 నుంచి పదో తరగతి వరకు చైతన్య పాఠశాలలో చదివాడు. ఇంటర్ వయార్ విశ్వశాంతి కళాశాలలో చదివాడు. మొదటిసారి నీట్ రాసినపుడు ర్యాంకు తక్కువ రావడంతో మరోసారి ప్రయత్నించాడు. ఈ ప్రయత్నంలో 645 మార్కులు సాధించి జాతీయస్థాయిలో 103వ ర్యాంకు సాధించాడు. ఇంటి వద్దే స్వయంగా చదివాడని తల్లిదండ్రులు తెలిపారు.

న్యూరో ఫిజిషియన్ అవుతా: సైనారెడ్డి, 866వ ర్యాంకు



మా నాన్న నరసింహారెడ్డి శింగనమల నియోజకవర్గం పెరవలి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. అమ్మ బుక్క రాయసముద్రం ఐసీడీఎస్ క్లస్టర్‌లో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నారు. నా కష్టానికి ఫలితంగా నీట్‌లో జాతీయస్థాయిలో 866వ ర్యాంకు వచ్చింది. దీంతో మా కుటుంబంలో పండుగ వాతావరణం నెలకొంది. ఎయిమ్స్‌లో సీటు సాధించి, అక్కడే న్యూరోఫిజీషియన్ చేయాలన్నదే నా లక్ష్యం.

ఎయిమ్స్‌లో సీటే లక్ష్యం: తరుణ్‌తేజ్, 1054వ ర్యాంకు



నాకు నీట్‌లో 1054వ ర్యాంకు వచ్చింది. మానాన్న తిమ్మారెడ్డి ధర్మవరం రూరల్ చిగిచెర్ల జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పని చేస్తున్నారు. మా అమ్మ లత గృహిణి. జాతీయ స్థాయిలో మెరుగైన ర్యాంకు రావడం ఆనందంగా ఉంది. ఎయిమ్స్‌లో సీటు సాధించడమే నా లక్ష్యం. ఆ తర్వాతనే ఏకోర్సు అనే నిర్ణయం చుకుంటా.

న్యూరో సర్జన్ అవుతా: చేతన్‌రెడ్డి, 1615వ ర్యాంకు



మానాన్న బిక్షమ్‌రెడ్డి అనంతపురంలో వ్యాపారం చేస్తారు. అమ్మ సునీత గృహిణి. పదో తరగతి వరకు అనంతపురం శ్రీచైతన్యలో, ఇంటర్ హైదరాబాద్ శ్రీచైతన్యలోను చదివా. ఇంటర్ మొదటి సంవత్సరం నుంచే నీట్ లక్ష్యంగా చదివా. న్యూరోసర్జన్ చేసి మంచి డాక్టరుగా ప్రజలకు సేవలందిస్తా.

కార్డియాలజిస్టుగా సేవలందిస్తా: శశాంక్, 1747వ ర్యాంకు



కార్డియాలజిస్టుగా ప్రజలకు సేవలందించాలన్నదే నా లక్ష్యం. మానాన్న విశ్వనాథ్ చౌదరి ట్రాన్స్‌కోలో విజిలెన్స్ విభాగంలో సీఐగా పని చేస్తున్నారు. అమ్మ గృహిణి. నాకు నీట్‌లో 1747 ర్యాంకు వచ్చింది. దీంతో మా కుటుంబంలో సంతోషం నెలకొంది. మంచి హృద్రోగ నిపుణుడిగా ఎదిగి పేదలకు సాధ్యమైనంత సేవ చేస్తా.

తల్లిదండ్రుల ఆశయం నెరవేర్చాలనే..:

అభినవ్‌రెడ్డి, 4889వ ర్యాంకు



మా నాన్న నిరంజన్‌రెడ్డి సాయినగర్‌లో మెడికల్ షాపు నిర్వహిస్తున్నారు. అమ్మ జేఎన్‌టీయూలో ఫార్మసిస్టుగా పనిచేస్తున్నారు. నేను చిన్నప్పటి నుంచి డాక్టర్ కావాలని మా అమ్మా నాన్న కోరుకునేవారు. వారి ఆశయం నెరవేర్చాలనే కష్టపడి చదివి నీట్‌లో ర్యాంకు సాధించా. ఎంబీబీఎస్‌లో మంచిగా చదివి మంచి ర్యాంకు సాధిస్తా. కార్డియాలజీ స్థిరపడి పేదలకు వైద్యసేవలందిస్తా.

కష్టపడితేనే...: త్రివిక్రమ్, 222వ ర్యాంకు



జీవితంలో ఎంచుకున్న రంగంలో రాణించాలంటే కష్టపడి చదవాల్సిందే. నవజాత శిశువు నుంచి వృద్ధుల వరకు ఏదో ఒక అనారోగ్యం వెంటాడుతోంది. ఈ సమస్యకు పరిష్కారం చూపేలా వైద్యరంగంలో మార్పులు తీసుకురావడమే లక్ష్యంగా పెట్టుకున్నా. మంచి ఎయిమ్స్ కాలేజ్‌లో ఎంబీబీఎస్ సీటు వస్తుంది. అమ్మ చంద్రకళ గృహిణి. నాన్న రెడ్డప్ప, ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా నల్లచెరువు మండలం గోరంట్లవారిపల్లిలో పనిచేస్తున్నారు.

మెడికల్ రీసెర్చ్ సైంటిస్ట్ కావడమే లక్ష్యం:

అశుతోష్, 765వ ర్యాంకు



మెడికల్ రీసెర్చ్ సైంటిస్ట్‌గా పని చేయాలని లక్ష్యాన్ని పెట్టుకున్నా. దీర్ఘకాలిక వ్యాధులకు పరిష్కారం చూపి, బాధితుల ఆయుష్షును పెంచేలా కృషి చేస్తా. ఎయిమ్స్ భువనేశ్వర్‌లో ఎంబీబీఎస్ సీటువస్తుందని అనుకుంటున్నా. మాది జనార్థనపల్లి, విడపనకల్లు మండలం. అమ్మ శ్రీవాణి ప్రైవేట్ టీచర్‌గా పని చేసేవారు. నాన్న రాము, బెంగళూరులో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నారు.

గుమాస్తా కొడుకు డాక్టర్: సుధీర్‌కుమార్, 1500వ ర్యాంకు



డాక్టర్‌గా పేద ప్రజలకు సేవ చేయాలన్నదే లక్ష్యం. మాది తాడిపత్రి మండలం బోగసముంద్రం. అమ్మ హేమావతి, గృహిణి. నాన్న బండల ఫ్యాక్టరీలో గుమాస్తాగా పని చేస్తున్నారు. బండల ఫ్యాక్టరీ యజమాని యాతం రాజశేఖర్‌రెడ్డి సాయంతో నీట్‌లో 1500వ ర్యాంక్ సాధించా. ఆయన సాయం ఎప్పటికి మరువలేనిది.

ప్రభుత్వ వైద్యుడిగా..: వికాస్, 5000వ ర్యాంకు



ప్రభుత్వ వైద్యుడిగా ఉద్యోగం చేయాలన్నది మా అమ్మ, నాన్న ఆకాంక్ష. వారి ఆశలను నెరవేర్చేలా కష్టపడి చదివి మంచి ర్యాంకు సాధించా. ఈఏపీసెట్‌లోనూ స్టేట్ 161వ ర్యాంకు వచ్చింది. ఎంబీబీఎస్‌కు ఎయిమ్స్ మెడికల్ కళాశాలలో సీటువచ్చే అవకాశముంది. మాది అనంతపురం, అమ్మ ఆదిలక్ష్మి గృహిణి. నాన్న కొండపనాయుడు, వ్యాపారం చేస్తారు.

కార్డియాలజీ చదువుతా: హర్షిణి, 57,200వ ర్యాంకు



ఎంబీబీఎస్ పూర్తిచేసి పీజీలో కార్డియాలజీ చేయలనుకున్నా. ఎంబీబీఎస్‌లో నెల్లూరు, నంద్యాల, తిరుపతిలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటురావచ్చు. నీట్‌లో ఫిజిక్స్ సబ్జెక్టులో జవాబు తెలియని వాటికి కూడా ఆప్షన్ పెట్టా. దీంతో మైనస్ మార్కులు పెరిగాయి. అమ్మ చంద్రకళ, గృహిణి. నాన్న మునిరెడ్డి, ఆర్‌ఎంపీగా పనిచేస్తున్నారు.

జనరల్ సర్జన్ అవుతా: నిషితారెడ్డి, 7253వర్యాంకు



పీజీలో జనరల్ సర్జన్ చేయాలని అమ్మానాన్న ఆశయం. వారి కలలను సాకారం చేసేలా నీట్‌లో మంచి మార్కులు సాధించా. గ్రామీణ ప్రాంత ప్రజలు ప్రత్యేక డాక్టర్ వద్దకు వెళ్లాలంటే ఇబ్బంది పడతారు. వారి ఇబ్బందులు తీరేలా వైద్య సేవ చేస్తా. మాది పెద్దపప్పూరు మండలం, పెద్దఎక్కలూరు. అమ్మ వరలక్ష్మి, గృహిణి, నాన్న మురళీమోహన్‌రెడ్డి వ్యవసాయం చేస్తారు.

శిలాఫలకం ధ్వంసం


వీరన్నగట్టుపల్లి వద్ద ధ్వంసం చేసిన శిలాఫలకం

గాండ్లపెంట, జూన్14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరన్నగట్టుపల్లి గ్రామం వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని కొందరు గుర్తు తెలియని దుండగులు శుక్రవారం రాత్రి ధ్వంసం చేశారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా గొడ్డివెలగల పంచాయతీలో వీరన్నగట్టుపల్లి నుంచి నీరుకుంట్లపల్లి వరకు రూ.50 లక్షల ఉపాధి నిధులతో కల్వర్టు మట్టిరోడ్లు వేశారు. పంచాయతీ రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ఈనెల 11న కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆవిష్కరించారు. దీన్ని చూసి ఓర్వలేక శిలాఫలాకాన్ని ధ్వంసం చేశారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

సౌందర్యాత్మక విమర్శకుడు రాజారామ్

పుస్తకావిష్కరణ సభలో డాక్టర్ శాంతినారాయణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

అనంతపురం కల్చరల్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): సౌందర్యాత్మక విమర్శకుడు రాజారామ్ అని సాహితీవేత్త డాక్టర్ శాంతినారాయణ అన్నారు. కవి తూముచర్ల రాజారామ్ రచించిన 'తేనె పూల మీద తుమ్మెద' వ్యాస సంపుటిని శనివారం స్థానిక ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల ఆడిటోరియంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ శాంతినారాయణ మాట్లాడుతూ... నక్షత్ర మాలికలా 27 మంది కవుల కవిత్వాలను విశ్లేషించిన రాజారామ్ గ్రంథం కవిత్వాన్ని అనుభవించే దిశగా దారిచూపే సైన్‌బోర్డులా విశిష్టంగా ఉందన్నారు. సాహితీలోకానికి అంతగా పరిచయం లేని కవుల కవిత్వాలను చదివి, అనుభవించి వాటి సారాన్ని 'తేనె పూల మీద తుమ్మెద'లా అనంత సాహితీలోకానికి పరిచయం చేసిన రాజారామ్ కృషి అభినందనీయమన్నారు. స్పందన అనంత కవుల వేదిక ప్రధాన కార్యదర్శి చంద్రశేఖరశాస్త్రి మాట్లాడుతూ.. విమర్శకు ఒక శిల్పం ఉందనీ, దానిని పట్టుకోవడంలో రాజారామ్ విజయం సాధించారని అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాధా స్కూల్ ఆఫ్ లర్నింగ్ కరస్పాండెంట్ వేలూరి జయచంద్ర, సాహితీవేత్తలు అంకె శ్రీనివాస్, వ్యక్తిత్వ వికాస నిపుణుడు జీఎల్‌ఎన్ ప్రసాద్, డాక్టర్ రాధేయ, ఉప్పరపాటి వెంకటేశులు, తరిమెల అమరనాథరెడ్డి, జయరామప్ప, జిరసం అధ్యక్షుడు కొత్తపల్లి సురేష్, కథకుడు రాయుడు, గంగిరెడ్డి అశ్వత్థరెడ్డి, ప్రజ్ఞా సురేష్, జూటూరు షరీఫ్, టీవీ రెడ్డి, కంబన్న, వన్నప్ప పాల్గొన్నారు.

ఒకటే జాయినింగ్ తేదీ ఇవ్వాలి..

2012 డీఎస్సీ టీచర్లకు న్యాయం చేయాలి

యూటీఎఫ్ నాయకుల డిమాండ్


డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అనంతపురం విద్య, జూన్ 14(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2012 ద్వారా ఎంపికైన మున్సిపల్ టీచర్లందరికీ ఒకటే జాయింగ్ తేదీ ఇవ్వాలని యూటీఎఫ్ నాయకులు.. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల విద్యా శాఖాధికారులు ప్రసాద్ బాబు, కిష్టప్పను కోరారు. బాధిత టీచర్లతో కలిసి నాయకులు శనివారం ఆర్డీటీ ఆడిటోరియం వద్ద డీఈఓలను కలిశారు. వారు మాట్లాడుతూ... 2012 డీఎస్సీ ద్వారా 250 మంది ఎస్‌జీటీలు ఎంపికై జిల్లాలోని వివిధ మున్సిపల్ యాజమాన్య స్కూళ్లలో చేరారన్నారు. ఒక్కో మున్సిపాలిటీలో ఒక్కో తేదీన వీరు జాయిన్ అయ్యారన్నారు. వారి సీనియారిటీ మారిపోవడంతో బదిలీ పాయింట్లలో తీవ్ర వ్యత్యాసం వస్తోందన్నారు. దీంతో 1, 2 ర్యాంకులో ఉన్న వారు సైతం 60వ ర్యాంకు తర్వాత ఉంటున్నారన్నారు. ఇలా కొందరికి తీవ్ర నష్టం వాటిల్లుతోందన్నారు. దీనిపై పలుమార్లు అర్జీ ఇచ్చినా.. పరిష్కారం కావడం లేదన్నారు. టీచర్ల సమస్యలు దృష్టిలో ఉంచుకుని, 2012 డీఎస్సీ ఎస్‌జీటీలకు 31-12-2012 తేదీని పరిగణించి, బదిలీల పాయింట్లలో ఏర్పడిన అసంబద్ధతను తొలగించాలన్నారు. తర్వాత ఫైనల్ సీనియారిటీ లిస్టు సిద్ధం చేసి, మున్సిపల్ టీచర్లు, మైనర్ మీడియం టీచర్లకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరారు. ఆ మేరకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి జయచంద్రారెడ్డి, ఆడిట్ కమిటీ సభ్యుడు రమణయ్య, సీనియర్ నాయకులు కోటేశ్వరప్ప, నాగేంద్ర, ధర్మవరం రామాంజనేయులు, సాయి గణేష్, టీచర్లు పాల్గొన్నారు.

అనంత, నెల్లూరు జట్ల విజయ పరంపర

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సౌత్ జోన్ క్రికెట్ టోర్నీలో అనంతపురం, నెల్లూరు జట్లు వరుస విజయాలు సాధించాయి. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి సౌత్‌జోన్ సీనియర్ వన్డే క్రికెట్ టోర్నమెంట్ నాలుగో రోజు శనివారం స్థానిక అనంతపురం క్రికెట్ స్టేడియం(ఆర్డీటీ)లో కొనసాగింది. అనంతపురం, కర్నూలు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన అనంతపురం జట్టు 47.3 ఓవర్లలో 263 పరుగులకు ఆలౌట్ అయ్యింది. బ్యాటర్లు ఎంకె దత్తారెడ్డి 69, అర్జున్ టెండూల్కర్ 61, రాజుకుళ్ళాయప్ప 50 పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన కర్నూలు జట్టు 44.3ఓవర్లలో 201పరుగులకే కుప్పకూలింది. అనంత బౌలర్లు సంతోష్‌కుమార్ 3, ప్రదీప్‌రెడ్డి 3వికెట్లు పడగొట్టి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. మరో మ్యాచ్‌లో నెల్లూరు, చిత్తూరు జట్లు తలపడగా మొదట బ్యాటింగ్ చేసిన నెల్లూరు నిర్ణీత 50ఓవర్లలో 8వికెట్లు కోల్పోయి 334 పరుగులు చేసింది. బ్యాటర్లు సుబ్రహ్మణ్యం 114పరుగులు, ఫర్హాద్‌ఖాద్రి 57, రోషన్‌కుమార్ 53 పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన చిత్తూరు 45.3ఓవర్లలో 283పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఇందులో బ్యాటర్ దినేష్‌వర్మ 133పరుగులు చేశారు. దీంతో నెల్లూరు 51పరుగుల తేడాతో విజయం సాధించింది. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీసత్యసాయి ప్రైమరీ స్కూల్‌లో ప్రవేశాలకు నేడు లాటరీ

పుట్టపర్తిరూరల్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తిలోని శ్రీసత్యసాయి ప్రైమరీ స్కూల్‌లో ఒకటో తరగతి ప్రవేశానికి ఈనెల 20న లాటరీ పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేయనున్నట్లు ప్రిన్సిపాల్ శివరామకృష్ణయ్య శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి స్థానిక ఇండోర్ స్టేడియంలో ఈనెల 20న ఉదయం 10 గంటలకు లాటరీ నిర్వహిస్తామన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల తల్లితండ్రులు గమనించాలని కోరారు.

హెచ్చెల్సీ లోకలైజేషన్ ఈఈగా పార్థసారథి

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): హెచ్చెల్సీ లోకలైజేషన్ ఈఈగా పార్థసారథి నియమితుడయ్యారు. మైనర్ ఇరిగేషన్ అనంతపురం డిప్యూటీ ఎస్‌ఈగా ఉన్న పార్థసారధిని హెచ్చెల్సీ లోకలైజేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా నియమిస్తూ రాష్ట్ర జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ధవళేశ్వరం ప్రాజెక్టు ఈఈగా ఉన్న సుధాకర్‌ను మైనర్ ఇరిగేషన్ అనంతపురం డిప్యూటీ ఎస్‌ఈగా బదిలీ చేశారు. ఇదివరకు లోకలైజేషన్ ఈఈగా పనిచేస్తున్న వెంకటరమణారెడ్డి గతనెల ఉద్యోగ విరమణ పొందారు.

వారికీ తల్లికి వందనం వర్తింపజేయాలి

ఏపీ స్టేట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్‌భాస్కర్

అనంతపురం విద్య, జూన్ 14(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు తల్లికి వందనం పథకం వర్తింపజేయాలని ఏపీ స్టేట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్‌భాస్కర్ శనివారం ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నికల సమయంలో నెలకు రూ.25వేల కంటే తక్కువ జీతం తీసుకునే ఉద్యోగులకు ప్రభుత్వ పథకాలు అమలు చేస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారన్నారు. దానిని అమలు చేయాలని ఆయన కోరారు.

చీనీ టన్ను రూ.34వేలు

అనంతపురంరూరల్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్టంగా రూ.34,100 ధర పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్టంగా రూ.3వేలు, సరాసరి రూ.18వేలతో అమ్ముడుపోయినట్లు చెప్పారు. మార్కెట్‌కు మొత్తంగా 816టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

న్యూస్ బాక్స్

నీట్‌లో విద్యార్థి ప్రతిభ



హర్షిత్‌రెడ్డి

కొత్తచెరువు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నీట్ పరీక్ష ఫలితాలను శనివారం విడుదల చేసింది. ఈ ఫలితాల్లో కదిరి మండలం మొటుకుపల్లికి చెందిన హర్షిత్‌రెడ్డి 720 మార్కులకు గాను 558 మార్కులుకు ఆలిండియాలో 8905 ర్యాంకు సాధించాడు. రాష్ట్రస్థాయిలో ఈఎస్‌డబ్ల్యూ కింద 907వ ర్యాంకు వచ్చింది. పీజీ చేసి పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే తన లక్ష్యమని హర్షిత్ రెడ్డి అన్నారు. తల్లిదండ్రులు చంద్రశేఖర్‌రెడ్డి, రాధమ్మ వ్యవసాయం చేస్తున్నారు. తల్లిదండ్రులతో పాటు గ్రామస్థులు విద్యార్థిని అభినందించారు. హిందూపురానికి చెందిన ధనుష్ 720 మార్కులకు గాను 645 మార్కులు సాధించాడు.

ఇద్దరు అధికారుల బదిలీ

తాడిమర్రి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మండలంలో పని చేస్తున్న పశువైద్యాధికారి స్వర్ణలత, వ్యవసాయశాఖ అధికారి రమాదేవి బదిలీ అయ్యారు. గడచిన ఐదేళ్లగా తాడిమర్రి మండలంలో పనిచేస్తుండటంతో వారిని ప్రభుత్వం తప్పని సరిగా బదిలీ చేసింది. వ్యవసాయశాఖ అధికారి రమాదేవి అనంతపురంలోని వ్యవసాయ శాఖ పరిశోధన కేంద్రానికి బదిలీ కాగా ఆమెస్థానంలో అగళి ఏఓగా పని చేస్తున్న లక్ష్మానాయక్ తాడిమర్రికి వచ్చి బాధ్యతలు స్వీకరించారు. పశువైద్యాధికారి స్వర్ణలత రామగిరి మండలానికి బదిలీ కాగా ఆమెస్థానంలో ఎవరినీ నియమించలేదు.

12 నుంచి ఏడు శనివారాల వ్రతం

ధర్మవరం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో వెలసిన లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో జూలై12 సెప్టెంబరు 6వతేదీ వరకు ఏడు శనివారాల వ్రతాన్ని నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ జగదీశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఉదయం 10-30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వ్రతాన్ని నిర్వహిస్తామన్నారు. భక్తులు ఈ వ్రతంలో పాల్గొనాలన్నారు. మరిన్ని వివరాలకు అర్చకులు రాజేశ్ 9985245013 నంబరును సంప్రదించాలన్నారు.

గొడవలకు దూరంగా ఉండండి

ధర్మవరంరూరల్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలంతా గొడవలకు దూరంగా ఉండి ప్రశాంత జీవనం గడపాలని రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. శనివారం మండలంలోని పోతుకుంట గ్రామం బృందావనం కాలనీలో ప్రజలతో గ్రామసభ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ప్రజలు ఎటువంటి గొడవలకు పోకుండా ప్రశాంతంగా జీవించాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. మద్యానికి బానిస కాకూడదని, పేకాటకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం సైబర్‌క్రైమ్, రోడ్డుప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఆయన వెంట సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశానవాటిక కోసం స్థలం పరిశీలన



శ్మశాన వాటిక మ్యాప్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ధర్మవరం, జూన్14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హిందూ శ్మశాన వాటికల కొరత వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ తక్షణమే స్పందించి స్థల పరిశీలనకు అధికారులను పంపించారు. శనివారం ఫోనిక్స్ కంపెనీ ప్రతినిధి రుద్రకుమార్, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, బీజేపీ నియోజకవర్గఇన్‌చార్జ్ హరీశ్‌బాబు పట్టణంలోని డంప్‌యార్డ్ ప్రాంతాన్ని పరిశీలించారు. మున్సిపల్ డీఈ వీరేశ్, బీజేపీ నాయకులు అంబటి సతీశ్, జింకాచంద్ర, సాకే ఓబుళేశు, మైనార్టీ నాయకులు నబీరసూల్, నాయకులు శీన, రాజారెడ్డి, రాజు, చంద్రమహేశ్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు విస్తృతం చేస్తాం

ధర్మవరం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ సేవలను మరింత విస్తృతం చేస్తామని నూతనంగా ఎంపికైన క్లబ్ పట్టణ అధ్యక్షుడు ఆకులేటి రమేశ్‌బాబు, సెక్రటరీ నాగేంద్ర అన్నారు. శనివారం ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాలలో లయన్స్ క్లబ్ కార్యవర్గాన్ని ప్రస్తుత అధ్యక్షుడు వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులుగా రమేశ్‌బాబు, నాగేంద్ర, కోశాధికారి వెంకటేశ్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని క్లబ్ వ్యవస్థాపకుడు పిట్టా వెంకటస్వామి, ప్రముఖులు మోహన్‌దాసు, పల్లెంవేణుగోపాల్, గోసేరాధాకృష్ణ, రాజగోపాల్, నరసింహులు, రాజీవ్ అభినందించారు. సభ్యులుగా బండిబాబు, వెంకటపార్థసారథి, ఆర్‌జీ వెంకటేశులకు సభ్యత్వం కల్గిస్తూ తీర్మానం చేశారు.

సచివాలయానికి వైసీపీ రంగుల తొలగింపు

ధర్మవరంరూరల్, జూన్14(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావులచెరువు గ్రామంలో సచివాలయానికి వైసీపీ జెండా, రంగులు అలానే ఉంచడంతో శనివారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. ఎంపీడీఓ సాయి మనోహర్ స్పందించారు. వెంటనే తొలగించాలని గ్రామ పంచాయతీ అధికారులను ఆదేశించారు. అధికారులు ఆగమేఘాల మీద గ్రామానికి చేరుకుని సచివాలయానికి ఉన్న వైసీపీ జెండా తొలగించి గోడలకు పెయింట్‌ను కొట్టించారు. మండలంలో ఎక్కడైనా సచివాలయాలకు ఇలాంటివి ఉంటే తొలగించాలని అధికారులకు ఎంపీడీఓ ఆదేశించారు.

22న రాష్ట్రస్థాయి బాడీబిల్డింగ్ పోటీలు

కదిరి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా బాడీబిల్డింగ్ ఫిట్‌నెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మిస్టర్ సింహపురి షీల్డుమ్యాన్ రాష్ట్రస్థాయి బాడీబిల్డింగ్ పోటీలు నెల్లూరు జిల్లాలో 22న నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దుంగావత్ రమేష్‌నాయక్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పోటీల్లో పాల్గొన్న ఉమ్మడి జిల్లా బాడీబిల్డర్లు 17న మంగళవారం ఉదయం 10గంటలకు కదిరి పట్టణంలోని లోటస్ జిమ్‌లో హాజరుకావాలన్నారు. వివరాలకు 96180807448 నంబరులో సంప్రదించాలని కోరారు. మంగళవారం ఎంపికైన బాడీబిల్డర్లను నెల్లూరు జిల్లాకు తీసుకెళ్లి అక్కడ పోటీల్లో పాల్గొనేలా తనవంతు కృషి చేస్తానన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

ఓబుళదేవరచెరువు, జూన్14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డబురువారిపల్లి గ్రామానికి చెందిన కుమ్మరసాని సుధాకర్ వ్యవసాయ పొలంలో గుర్తు తెలియన దుండగలు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్‌వైర్ తోపాటు ఆయిల్‌ను చోరీ చేసినట్లు శనివారం బాధిత రైతులు విలేకరుల తెలిపారు. చోరీ జరిగిన విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.

ఎన్నాళ్లీ ఎదురుచూపు..?

- ఏడేళ్లుగా పోరాటం.... దక్కని ఇంటిస్థలాలు
- పట్టించుకోని ప్రజా ప్రతినిధులు, అధికారులు
- ఇంటి అద్దెలు కట్టలేక ఇబ్బందులు
- కూటమి ప్రభుత్వంలోనైనా మంజూరయ్యేనా..?

తనకల్లు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): అధికారం చేపట్టే ఏప్రభుత్వమైనా మా ప్రభుత్వం పేద సమస్యల పరిష్కారినికి పెద్దపీట వేస్తుందని మైకులు పట్టుకుని చెవులు చిల్లులు పడేలా అదరగొడతారు. తమ పాలనలో కూడు, గూడు, గుడ్డకు లోటు లేకుండా చూస్తామన్నది పార్టీల సిద్ధాంతం. అయితే ఏప్రభుత్వాలు కూడా పేద ప్రజల సమస్యల పరిష్కారంలో తగినంత చొరవ చూపడంలేదనేది జగమెరిన సత్యం. గత వైసీపీ పాలనలో ఐదేళ్లుగా ఇంటి స్థలాల కోసం ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించినా ప్రయోజనం శూన్యం. జగనన్న కాలనీల పేరుతో ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేసినా, కేవలం పట్టాల పంపిణీతో కాలం గడిచిపోయింది. అవికూడా పలుకుబడి, తెలిసిన వారికే మంజూరు చేశారు. నిరుపేదలు మాత్రం పట్టాలకోసం ఐదేళ్లుగా పోరాటాలు కొనసాగిస్తున్నా ఏ నాయకుడు పట్టించుకున్న పాపాన పోలేదు.

● మండలకేంద్రమైన తనకల్లు వద్ద పట్టాల కోసం పేద ప్రజలు గగ్గోలు పెట్టినా అప్పటి వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. తనకల్లుకు సమీపంలోని బత్తినవారిపల్లి వద్ద రూ.లక్షలు వెచ్చించి రెవెన్యూ గుట్టలను చదును చేసి, తమకు కావలసిన, తమకు అనుకూలమైనవారికి జగనన్నకాలనీ పేరుతో పట్టాలు మంజూరు చేశారు. పట్టాలిచ్చిన ప్రాంతం మండలకేంద్రానికి దూరంగా ఉండడంతో, లబ్ధిదారులెవరూ అక్కడ ఇళ్లు నిర్మించుకోవడానికి ముందుకు రాలేదు. తమకు అనుకూలమైన సర్వే నంబరు 793లో పట్టాలివ్వాలని కోరినా అప్పట్లో పట్టించుకోలేదు. దీంతో 120 మంది పేదలు ఇళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోకి వివిధ గ్రామాల నుంచేకాక కర్ణాటక, అన్నమయ్యజిల్లాలోని ములకలచెరువు, తంబళ్లపల్లె తదితర ప్రాంతల నుంచి ఇక్కడకు వస్తుంటారు. బెల్దారి, మెకానిక్, కార్పెంటర్, ఎలక్ట్రికల్ వైరింగ్ పనులకోసం వచ్చి తనకల్లులోనే నివాసముంటున్నారు. అలాంటివారు పట్టాలకోసం ప్రయత్నించినా, జగనన్నకాలనీలో పట్టాలు పొందలేకపోయారు. ఆర్థికంగా ఉన్నవారు సైతం పట్టాలు పొందారు. తనకల్లులో పట్టాలు లేకుండా



ఇంటిపట్టాలకోసం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న దృశ్యం(ఫైల్)



సర్వే నంబరు 793లో గుడిసెలు వేసుకున్న పేదలు

నివాసమున్నవారందరూ సర్వే నంబరు 793లో పట్టాలివ్వాలని గుడిసెలు వేసుని, కొంతమంది పునాదులు వేసుకుని నేటికీ రెవెన్యూ అధికారులు చుట్టూ తిరిగినా కనికరించడం లేదు. ఆ పోరాటానికి సీపీఎం, సీఐటీయూ మద్దతు ప్రకటించాయి. పలుమార్లు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు నిర్వహించారు. అయినా ఏ ఒక్క అధికారి స్పందించిన పాపానపోలేదు. రెవెన్యూ యంత్రాంగం చోద్యం చూస్తోందే తప్ప పట్టించుకున్న దాఖలాలు లేవు. సర్వే నంబరు 793లో 12.87 ఎకరాల భూమి ఉంది. ఇందులో వంద పట్టాలదాకా గత టీడీపీ ప్రభుత్వంలో మంజూరు చేశారు. ఇంకా 120 కుటుంబాలు పట్టాలకోసం ప్రయత్నాలు కొనసాగిస్తున్నాయి. ప్రభుత్వాలు మారుతున్నా పట్టాలు పొందలేకపోతున్నామని నిరుపేదలు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం
- శోభాసువర్ణమ్మ, తహసీల్దార్

సర్వే నంబరు 793 ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న విషయం తన దృష్టికి వచ్చింది. ఉన్నతాధికారులు ఆదేశిస్తే పరిశీలించి న్యాయం చేస్తాం.

కూలికెళితేనే కుండకాలేది



కూలి పనులకోసం వచ్చి తనకల్లులోనే స్థిరపడ్డాం. ఎన్నో ఏళ్లుగా ఇంటిపట్టాకోసం ప్రయత్నిస్తున్నాం. ఇక్కడే గుడిసె వేసుకున్నాం. పూటగడిచేది కష్టంగా ఉంది. ఇంటి అద్దెలు, పిల్లల చదువులకు ఇబ్బందులు పడుతున్నాం. ఇంటి పట్టా కోసం కొన్నేళ్లుగా ప్రయత్నిస్తున్నాం. అధికారులు ఎందుకు ఇవ్వలేదో తెలియదు. ప్రభుత్వ భూమిలో గుడిసె వేసుకుంటే పట్టా ఇవ్వడానికి అధికారులకు ఏమి అడ్డంకులు ఉన్నాయో తెలియడం లేదు. వెంటనే పట్టా మంజూరు చేసి ఆదుకోవాలి.

- తిప్పమ్మ, రెడ్డివారిపల్లి తండా

ధర్నాలు, రాస్తారోకోలకే సరిపోతోంది



గ్రామీణ ప్రాంతాల్లో బేల్దారి పనులు లేవు. అందుకే తనకల్లుకు వచ్చా. ఇక్కడే ఇల్లు అద్దెకు తీసుకుని వాసముంటున్నా. సర్వే నంబరు 793లో ప్రభుత్వ భూమి ఉందని నిరుపేదలందరూ గుడిసెలు వేసుకుంటుంటే తానూ గుడిసె వేసుకున్నా. ఇన్నేళ్లుగా ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్నా ఏ అధికారి స్పందించిన పాపాన పోలేదు. జగనన్న కాలనీల పేరుతో అనువుగాని చోట పట్టాలిచ్చారు. అక్కడ వద్దని ఇక్కడ అడిగితే ఎందుకివ్వరో అర్థకాలేదు. ప్రభుత్వం వెంటనే ఇంటిపట్టా ఇవ్వాలి.

- రమణ, బేల్దారి, చిన్నరామన్నగారిపల్లి

రెవెన్యూ అధికారులు స్పందించడం లేదు



తనకల్లు వద్ద 793 సర్వే నంబరులో 12.87 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో 120 మంది నిరుపేదలు గుడిసెలు వేసుకుని, పట్టాకోసం ఎదురుచూస్తున్నారు. ఏడేళ్లుగా ఇంటిపట్టాలకోసం పోరాటం కొనసాగిస్తున్నా, ఓ తహసీల్దార్ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేయమంటే అందరూ చేశారు. అయినా పట్టించుకోలేదు. నలుగురు తహసీల్దార్లు మారిపోయారే తప్ప ఇంటిపట్టాల సమస్యల పరిష్కారం కాలేదు. సమస్యను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ దృష్టికి తీసుకెళ్తడానికి ప్రయత్నిస్తున్నాం.

- శివన్న, సీపీఎం, తనకల్లు

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం: ఎమ్మెల్యే కందికుంట

కదిరి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే మా లక్ష్యమని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. శనివారం పది సంవత్సరాలుగా నిర్మాణం పూర్తికాని, మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల, పాలిటెక్నిక్ కళాశాలను ఆయన మైనార్టీ కౌన్సిలర్లు, నాయకులు, అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పది సంవత్సరాల క్రితం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో మైనార్టీ విద్యాసంస్థల నిర్మాణం ప్రారంభమైందన్నారు. గత ప్రభుత్వం వీటిని గాలకొద్దిలేస్తే తిరిగి తమ ప్రభుత్వమే పూర్తి చేస్తోందన్నారు. గతంలో మైనార్టీ పాఠశాలకు రూ.18 కోట్లు కేటాయించారని, ప్రస్తుతం ఆ నిధులు సరిపోకపోవడంతో మరో రూ.7కోట్లు ఇవ్వాలని విద్యాశాఖమంత్రి నారాలోకేశ్‌ను కోరనున్నట్లు చెప్పారు. ఈ విద్యాసంవత్సరంలోనే వీటిని ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అభివృద్ధికోసమే తాము ఆలోచిస్తున్నామని, ఒకవైపు అభివృద్ధి మరోవైపు ప్రజల సంక్షేమం అమలు చేస్తున్నామన్నారు. తల్లికి వందనం నిధులు విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాలో జమ కావడంతో వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం తరుపున లబ్ధిపొందిన తల్లులు, పిల్లలు మాట్లాడుతున్నారన్నారు. తల్లికి వందనంపై వెకిలిచేష్టలు చేసిన జగన్ వెకిలి మనిషిగానే మిగిలిపోతారన్నారు. నియోజకవర్గంలో నిత్యం ప్రజలతో కలిసి ఉంటామని, వారి బాగోగులకోసకే పనిచేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో వీవీఎస్ శర్మ, మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, పలువురు కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కందికుంట, నాయకులు

రక్తదానం.. ప్రాణదానంతో సమానం

కదిరిఅర్బన్: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. శనివారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రక్తదానం చేయడానికి విద్యావంతులు, యువకులు ముందుకొస్తున్నారని, వారికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. అసవరమైన సమయంలో రక్తం ఇవ్వడమేకాకుండా ప్రజలను చైతన్యవంతులను చేసి, రక్తమివ్వడానికి ముందుకొచ్చేలా ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. ఆర్డీవో వీవీఎస్ శర్మ, మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, డాక్టర్లు మధుసూదన్, సిబ్బంది, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యోగా సాధనతో ఆరోగ్య సంరక్షణ: జేసీ

పుట్టపర్తి టౌన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): యోగా సాధన వల్ల ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని జేసీ అభిషేక్‌కుమార్ అన్నారు. శనివారం పుట్టపర్తిలోని సత్యమ్మ దేవాలయం వద్ద ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ ప్రభుత్వ బాలికల వసతిగృహం ఆవరణంలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో జేసీ పాల్గొని, ఆసనాలు వేశారు. ఆయన మాట్లడుతూ మానసిక ప్రశాంతత శరీరక ఆరోగ్యం కోసం యోగా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రస్తుత సమయంలో మానసిక ఒత్తిడితో కూడాన జీవితంలో ఆరోగ్యం పరిరక్షించుకోవాలన్నారు. యోగాను జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, సాంఘిక సంక్షేమ శాఖాధికారి శివరంగప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.



యోగా సాధన చేస్తున్న జేసీ అభిషేక్‌కుమార్

మాట నిలబెట్టుకున్న బాబు
-గుజ్జల లక్ష్మీదేవి, గుజ్జల రామకృష్ణ

ధర్మవరం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): విద్యా సంవత్సరం ప్రారంభంలోనే తల్లికి వందనం పథకం కింద డబ్బులు బ్యాంకు ఖాతాల్లో వేస్తామన్నమాటను ముఖ్యమంత్రి చంద్రబాబు నిలబెట్టుకున్నారని పట్టణంలోని 23వ వార్డుకు చెందిన దంపతులు గుజ్జల లక్ష్మీదేవి, గుజ్జల రామకృష్ణ ఆనందం వ్యక్తం చేశారు. ఈక్రమంలోనే 23వ వార్డులో చంద్రబాబు చిత్రపటాన్ని ఏర్పాటు చేసి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో లక్ష్మీదేవితోపాటు ఏపీసీడ్స్ రాష్ట్ర డైరెక్టర్ కమతం కాటమయ్య, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, 23, 24 వార్డుల కో-ఆర్డినేటర్ మాధవరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవి మాట్లాడుతూ.. తమ నలుగురు కుమార్తెలకు తల్లికి వందనం కింద రూ.52వేలు జమైనట్లు తెలిపారు. ఈ డబ్బును పిల్లల చదువులకే ఖర్చు చేస్తామని తెలిపారు. తన కుమార్తెలు రాధిక 9, సంజన 7, సుధా 2, కృష్ణవేణి రెండోతరగతి చదువుతున్నట్లు తెలిపారు.



కుమార్తెలతో లక్ష్మీదేవి, రామకృష్ణ

'తల్లికి వందనం' సంబరాలు



సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కదిరిఅర్బన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా శుక్రవారం నుంచి తల్లికి వందనం పేరుతో విద్యాసంవత్సరం ప్రారంభంరోజే ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. తల్లుల బ్యాంక్ ఖాతాల్లో నగదు జమకావడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. శనివారం మండలంలోని కుమ్మరవాండ్లపల్లిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఎన్నికల హామీలో ప్రధానమైన తల్లికి వందనం పథకం తల్లుల ఖాతాలో జమకావడం ఆనందంగా ఉందన్నారు. గత ప్రభుత్వం అమ్మఒడి పేరుతో కుటుంబంలో ఒకరికే వర్తింపచేస్తే కూటమి ప్రభుత్వం చదువుతున్న పిల్లలందరికీ అమలు చేసిందన్నారు. టీడీపీ మండలకన్వీనర్ చెన్నకేశవులు, నాయకులు గంగులప్ప, హరి, భార్గవ్, రమణ, మనోహర్, శ్రీనివాసులు, ప్రేమలత, ఆంజనేయులు, చంద్రశేఖర్, ఈశ్వర్ పాల్గొన్నారు.

నల్లమాడ: మండలకేంద్రంలోని ముస్లిం మైనార్టీ వీధిలో శనివారం టీడీపీ నాయకులు, తల్లులు, పిల్లలు చంద్రబాబునాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం అమ్మఒడి ఒక విద్యార్థికి మాత్రమే ఇచ్చేవారని, కూటమి ప్రభుత్వం ఇంటిలో ఎంతమంది చదువుకుంటుంటే అందరికి తల్లికి వందనం పథకం ద్వారా తల్లుల ఖాతాలో ఒక్కొక్క విద్యార్థికి రూ.13వేల జయమ చేయడం ఆనందంగా ఉందన్నారు. సీఎం, ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. బుట్టి నాగభూషణనాయుడు, కోట్లో మంజునాథ్‌రెడ్డి, ప్రకాష్, రహంతుల్లా, నబీరసూల్, మౌలాలీ, ఖరామత్ పాల్గొన్నారు.



నల్లమాడలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

శాస్త్రీయ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కండి

● మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

కదిరిఅర్బన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం నిరంతరం కృషి చేస్తున్న జనవిజ్ఞాన వేదికలో భాగస్వాములు కావలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని ఎన్జీవో హోమ్‌లో జనవిజ్ఞాన వేదిక సభ్యత్వ ప్రచార పోస్టర్లను ఆయన విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథాన్ని ప్రజల్లో తీసుకెళ్లడానికి వేదిక కృషి చేస్తోందన్నారు. మనం చేసే ఆలోచన క్రమాన్ని ఆటంకపరిచి అడ్డుకునే శక్తులు ప్రస్తుతం సమాజంలో అనేకమున్నాయన్నారు. అలాంటి వాటినుంచి ప్రజలను అప్రమత్తంచేసే కర్తవ్యం జనవిజ్ఞాన వేదిక చేస్తోందన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమం 1 నుంచి జూలై 15వరకు కొనసాగుతుందన్నారు. అధిక సంఖ్యలో చేరాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు మహేంద్రరెడ్డి, ఉపాధ్యాయులు నరసారెడ్డి, జిల్లా సైన్సు అధికారి తనూజ్‌కుమార్, యూటీఎఫ్ నాయకులు తాహేర్‌వలీ, ఎస్ఎఫ్ఐ బాబ్‌జాన్, ఉపాధ్యాయులు యల్లప్ప, జవహర్, రాజారత్నం పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● జనసేన నాయకుడు చిలకం మధుసూదన్‌రెడ్డి



రైతులకు విత్తన వేరుశనగ అందజేస్తున్న చిలకం మధుసూదన్‌రెడ్డి

ధర్మవరంరూరల్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): రైతుసంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని, త్వరలోనే రైతులకు అన్నదాత సుఖీభవ కింద పెట్టుబడి నగదు జమ చేస్తామని జనసేన రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని రేగాటిపల్లిలో ప్రభుత్వం రైతులకు అందించే సబ్సిడీ విత్తన వేరుశనగ కాయలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి హాజరైన ఆయన రైతులకు విత్తనకాయలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. వైసీపీ హయాంలో ఏనాడు రైతుల సంక్షేమం పట్టించుకున్న పాపనపోలేదన్నారు. రైతులకు అన్నివిధలా ఆదుకునేందుకు సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కృషి చేస్తున్నారని అన్నారు. జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలను తొలగించుకుంటున్న యజమానులు



ఆక్రమణలను తొలగించుకుంటున్న దృశ్యం

కొత్తచెరువు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రధాన రహదారులకు ఇరువైపులా ప్రభుత్వ ఆర్అండ్‌బీ స్థలాల్లో అక్రమకట్టడాలను నిర్మించినవారికి అధికారులు నోటీసులు అందజేశారు. వారంలోగా కట్టడాలను తొలగించుకోకపోతే తామే తొలగిస్తామని హెచ్చరించారు. దీంతో కొంత మంది షాపుల యజమానులు అధికారులు ఇచ్చిన మార్కింగ్ మేరకు కట్టడాలను తొలగించుకుంటున్నారు. శనివారం ధర్మవరం ప్రధాన రహదారి పక్కన డాక్టర్ శంకరప్ప భార్య సరోజ దుకాణాల ముందు ఉన్న మెటికలు, ప్లాట్‌ఫారం, వరండాను తొలగించుకున్నారు. ఒక్కొక్కరు షాపుల ముందు వేసిన రేకులను తొలగిస్తుండటంతో రోడ్లు వెడల్పు అవుతున్నాయి. ఇలాగే నాలుగురోడ్లలో కూడా అక్రమకట్టడాలను తొలగిస్తే ట్రాఫిక్‌కు సమస్య తీరనుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

జిల్లా వైద్యాధికారి తనిఖీ



ఆసుపత్రి సిబ్బందితో చర్చిస్తున్న జిల్లా వైద్యాధికారి ఫైరోజ్ బేగం

తనకల్లు, జూన్14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలసముద్రం గ్రామ సచివాలయంలో శనివారం నిర్వహిస్తున్న జాతీయ సార్వత్రిక వ్యాధి నిరోధిక టీకాల కార్యక్రమాన్ని జిల్లా వైద్యాశాఖాధికారిని ఫైరోజ్ బేగం తనిఖీ చేశారు. టీకాలు వేసుకునే పిల్లలు, తల్లులకు వాటి ప్రాముఖ్యతను వివరించారు ప్రాణాంతకమైన జబ్బులు రాకుండా ప్రభుత్వం అందించే టీకాలను ప్రతి ఒక్కరూ వేయించుకోవాలన్నారు. అనంతరం రిజిస్టర్లు పరిశీలించారు. ప్రభుత్వ పథకాల అమలు సక్రమంగా చేయాలని సూచించారు. ఆమెతోపాటు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ నాగేంద్రనాయక్, డాక్టర్లు లోకేశ్వర్‌రెడ్డి, ధర్మరాజు, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

ధర్మవరం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్టేట్‌బ్యాంక్ కాలనీ మధు కంటి ఆస్పత్రిలో 16 నుంచి జూలై 15వ తేదీ వరకు విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షా శిబిరాన్ని నిర్వహించనున్నట్టు జిల్లా అంధత్వ నివారణ విశ్రాంత అధికారి, కంటి వైద్యనిపుణులు నరసింహులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి దృష్టిలోపాన్ని గుర్తిస్తామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గాండ్లపెంట, : మండలంలోని మల్లమీదపల్లిలో ఆదివారం చిన్నపిల్లలకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు వైద్యుడు పాల్యం హర్షవర్ధన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చిన్నపిల్లలకు ఉచితంగా చికిత్సలు చేస్తామన్నారు. ఉచితంగా మందులు అందచేస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జిల్లా క్రికెట్ జట్టుకు మైత్రి ఎంపిక



ధర్మవరం, జూన్14(ఆంధ్రజ్యోతి): అండర్-19 బాలికల విభాగం క్రికెట్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టుకు ధర్మవరం పట్టణానికి చెందిన క్రీడాకారిణి మైత్రి ఎంపికైనట్లు ఆర్డీటీ కోచ్ రాజశేఖర్ తెలిపారు. స్థానిక గుట్టకిందపల్లి వద్ద ఉన్న ఆర్డీటీ క్రీడామైదానంలో మైత్రి క్రికెట్ శిక్షణ తీసుకుంటున్నట్లు వెల్లడించారు. మంచి ప్రతిభ కనబరచి ఉమ్మడి అనంత జిల్లా జట్టుకు ఎంపికకావడం అభినందనీయమన్నారు. కాగా నెల్లూరులో ఈనెల 18 నుంచి 24 వరకు అండర్-19 బాలికల క్రికెట్ పోటీలు నిర్వహిస్తారని ఆయన తెలిపారు.

పార్టీకి పునాదులు.. గ్రామ కమిటీలు



గ్రామ కమిటీల ఎన్నికపై చర్చిస్తున్న నాయకులు

చిలమత్తూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): పార్టీని బలోపేతం చేసుకోవడంలో గ్రామ కమిటీలు కీలకమని మండల టీడీపీ కన్వీనర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని టేకులోడు పంచాయతీలో ఆయన పర్యటించి అక్కడి నాయకులతో గ్రామ కమిటీలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతంలో గ్రామ కమిటీలు పునాదులు వంటివన్నారు. గ్రామకమిటీలలో అన్ని వర్గాలకు స్థానం కల్పించి పార్టీని బలోపేతం చేద్దామని సూచించారు. పార్టీకి కార్యకర్తలు మూలస్తంభాలని, వారికి ఏ కష్టం వచ్చినా ఎమ్మెల్యే బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామన్నారు. అందరి అభిప్రాయాలు తీసుకున్న తరువాత కమిటీలు ఏర్పాటు చేసుకుందామన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సరోజమ్మ, నాయకులు బయపరెడ్డి, ఓబులప్ప, ఎల్.రంగారెడ్డి, నాగప్ప, నరసింహప్ప తదితరలు ఉన్నారు.

శిథిలావస్థకు పాఠశాల భవనాలు

- పట్టించుకోని అధికార యంత్రాంగం



శిథిలావస్థకు చేరుకున్న ఐ తునసనపల్లి పాఠశాల భవనం

అగళి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొన్ని పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వర్షం వస్తే పాఠశాల జలమయంగా మారుతాయని, విద్యార్థులు వరండాలో కూర్చొని చదువుకోవాల్సి వస్తోందని వారు అంటున్నారు. ఐ తునసనపల్లి, బొమ్మరసనపల్లి ఎం. గొల్లహట్టి, కంబదహళ్లి, కసాపురం గ్రామాల్లోని పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. విద్యాధికారులు మాత్రం పట్టించుకోకుండా ఉన్నారని, ప్రమాదం జరిగితే ఎవరిది బాధ్యత అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా శిథిలావస్థకు చేరుకున్న పాఠశాలలను గుర్తించి వాటికి మరమ్మతు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఘననివాళి



నివాళులు అర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మడకశిర టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం చెగువేరాకు ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఈరేష్ మాట్లాడుతూ చెగువేరా పోరాటయోధుడన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కల్యాణ్, ప్రశాంత్, నవీన్, నరేంద్ర తదితరులు ఉన్నారు.

పూల మార్కెట్‌ను కొనసాగించండి

ఎమ్మెల్యేకు రైతుసంఘం నాయకుల వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

పావగడ, జూన్ 14(ఆంధ్రజ్యోతి): నూతన బస్టాండులో ఉన్న పూలమార్కెట్‌ను అదే స్థలంలో యథావిధిగా కొనసాగించాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు పూజారప్ప ఎమ్మెల్యే వెంకటేశ్‌ను కోరారు. ఈ మేరకు శనివారం వినతిపత్రం అందజేశారు. పూలమార్కెట్‌ను బస్టాండు వద్ద కొనసాగించరాదని, మురికి కాలువ పక్కన ఉన్న స్థలాన్ని కేటాయించడం జరిగిందన్నారు. దుర్గంధంతో ఉన్న ఆ ప్రాంతానికి పూలు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపడంలేదని, యథావిధిగా పూలమార్కెట్‌ను పాతప్రదేశంలో కొనసాగేలా చర్యలు తీసుకోవలని కోరారు. పూలవ్యాపారులకు తప్పకుండా న్యాయం చేస్తామని ఎమ్మెల్యే ఈ సందర్భంగా వారికి హామీ ఇచ్చారు.

రక్తదానం చేయండి

హిందూపురం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): యువత స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేయాలని వైద్యులు సూచించారు. ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని హిందూపురంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ డేవిడ్‌రాజ్, చరణ్‌కుమార్ మాట్లాడుతూ యువత స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేస్తే మరికొంతమందికి ప్రాణం నిలిపినవారవుతారన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న బ్లడ్‌బ్యాంక్‌లో రక్తదానం చేయాలన్నారు. ముఖ్యంగా గర్భిణులు ప్రసవించే సమయంలో రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు, తలసీమియా వ్యాధిగ్రస్తులకు రక్తం ప్రాణాలు నిలుపుతుందన్నారు. 18-60ఏళ్ల వరకు రక్తదానం చేయవచ్చన్నారు.



రక్తదానంపై ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కనిపించని సూచిక బోర్డులు

ఏ రహదారి ఎలా వెళుతుందో తెలియక వాహనదారుల ఇక్కట్లు



అంబేడ్కర్ సర్కిల్‌లో కనిపించని సూచిక బోర్డులు



రాజీవ్‌గాంధీ సర్కిల్‌లో...

మడకశిర టౌన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): వాహనదారులు ఎంచుకున్న గమ్యస్థానం చేరేందుకు సూచిక బోర్డులు ఎంతో దోహదపడతాయి. ఎవరిని అడగకుండా సూచిక బోర్డుల ఆధారంగా నేరుగా ఎంచుకున్న పట్టణ, నగర, గ్రామాలకు చేరుకోవచ్చు. అయితే నియోజకవర్గ కేంద్రమైన మడకశిర పట్టణంలో ఎక్కడా సూచిక బోర్డులు కనిపించవు. దీంతో వాహనదారులు గమ్యస్థానం చేరుకునేందుకు ఏ దారి ఎటువెళ్తుందో తెలియక తికమకపడాల్సి వస్తోంది. కొంతమంది కిలోమీటరు, అరకిలోమీటరు వెళ్లి వెనుదిరిగి వచ్చి కూడలిలో పూలు, పండ్ల వ్యాపారులు, దుకాణాదారులను వారు వెళ్లాల్సిన రూటు గురించి అడిగి తెలుసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పట్టణంలో రాజీవ్‌గాంధీ, అంబేడ్కర్, వాల్మీకి సర్కిల్ ప్రధాన రహదారుల కూడళ్లు ఉన్నాయి. ఈ కూడళ్ల నుంచి మధుగిరి, తుమకూరు, బెంగుళూరు, పావగడ, పెనుకొండ, అనంతపురం, హిందూపురం, అమరాపురం, హిరియూరు తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు రూట్లు ఉన్నాయి. అయితే సూచిక బోర్డులు లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. హెవీటన్నేజీ లోడుతో వచ్చే వాహనదారుల పరిస్థితి మరీ ఇబ్బందికరంగా ఉంటోంది. వెళ్లాల్సిన రూట్‌లో కాకుండా మరో రూట్‌లో వెళ్తే అక్కడి నుంచి భారీ వాహనాన్ని వెనుదిరిగి తీసుకురావాలంటే వారు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. పట్టణంలో అసలే ఇరుకైన రోడ్లు. భారీ వాహనం కట్‌చేయాలంటే ట్రాఫిక్ అంతరాయం కూడా ఎక్కువగా ఉంటుందోని పట్టణ ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సత్వరమే రూట్‌లను సూచించే విధంగా ప్రధాన కూడళ్లలో సూచిక బోర్డులు ఏర్పాటుచేయాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

కలిసికట్టుగా అభివృద్ధి చేసుకుందాం

మున్సిపల్ చైర్మన్, కమిషనర్

హిందూపురం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ అధికారులు, పాలకవర్గం కలిసి హిందూపురం పట్టణాన్ని అభివృద్ధి చేస్తామని మున్సిపల్ చైర్మన్ రమేష్, కమిషనర్ మల్లికార్జున అన్నారు. బదిలీపై వచ్చిన మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున శనివారం కౌన్సిలర్‌లతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్‌ను చైర్మన్, కౌన్సిలర్లు సత్కరించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ పట్టణానికి కేటాయించే అభివృద్ధి నిధులను సక్రమంగా వినియోగించి ప్రజల మన్ననలు పొందుదామన్నారు. మున్సిపల్ కమిషనర్‌తోపాటు అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకుని పార్టీలకు అతీతంగా హిందూపురాన్ని అభివృద్ధి చేసి సమస్యలు పరిష్కరిద్దామన్నారు. కమిషనర్ మాట్లాడుతూ పాలకవర్గం సహకరిస్తే పట్టణ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించవచ్చన్నారు. ప్రతినెలా కౌన్సిల్ సమావేశాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

త్యాగరాజ్‌నగర్‌లో స్వచ్ఛ హిందూపురం

పట్టణంలోని త్యాగరాజ్‌నగర్‌లో టీడీపీ యూత్ నాయకుల ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛసేవ-స్వచ్ఛ హిందూపురం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రమేష్, కమిషనర్ మల్లికార్జున, పట్టణాధ్యక్షుడు వెంకటేశ్, టీడీపీ యూత్ నాయకులు యుగంధర్, అమీన్, భార్గవ్, బాబురెడ్డి, అశోక్, వెంకటరమణ పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నీ ప్రారంభం



టోర్నీని ప్రారంభిస్తున్న బీజేపీ నాయకుడు

పరిగి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ వాలీబాల్ టోర్నీ శనివారం మండలంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రారంభమైంది. టోర్నీని బీజేపీ సీనియర్ నాయకుడు బంగారు చంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిసకారాదన్నారు. చిన్నప్పటి నుంచి ఆటల వైపు కూడా దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో పీఈటీ వినోద్‌కుమార్, అలీం, ఉదయ్, సంజీవమూర్తి, బాబు, ప్రసాద్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్ర నిర్వహణకు అధికారుల నియామకం

మడకశిర టౌన్/రూరల్, జూన్14(ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర నిర్వహణకు ప్రత్యేకంగా అధికారులను నియమించినట్లు ఎంపీడీఓ సోనీబాయి తెలిపారు. కదిరేపల్లి, మొలవాయి పంచాయతీలకు తహసీల్దార్ కరుణాకర్, ఎంఈఓ1 శ్రీనివాస్‌భాస్కర్‌ను చందకచర్ల, గౌడనహళ్లికి, ఎంఈఓ-2 నరసింహమూర్తి గుండమలకు నియమించడం జరిగిందన్నారు. అడ్మినిస్ట్రేటివ్ అధికారి శ్రీనివాస్‌రావును గంగుళవాయిపాళ్యం, గోవిందపురం పంచాయతీలకు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ విజయ్‌కుమార్‌ను ఆర్.అనంతపురానికి, ఇరిగేషన్ ఏఈ భార్గవ్‌ను వై.బి.హళ్లికి, ఐకేపీ ఏపీఎం నాగమణిని మడకశిరకు నియమించామన్నారు. అసిస్టెంట్ మంజునాథ్ ఆమిదాలగొందికి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మను ఛత్రం, ఎపీఓ భార్గవిని హరేసముద్రం పంచాయతీలకు యోగంధ్ర నిర్వహణకు నియమించినట్లు తెలిపారు.

వాహనాల తనిఖీ



వాహన తనిఖీ చేస్తున్న ఎస్ఐ ఇసాక్ బాషా

అమరాపురం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వైఎస్ఆర్ సర్కిల్‌నందు వాహనాలను తనిఖీ చేయడం జరిగింది. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సురెన్స్ కలిగి ఉండాలన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారు, జీప్, బస్సు డ్రైవర్లు, సీటు బెల్ట్ ధరించాలని ఎస్ఐ ఇసాక్‌బాష సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

రొళ్ల, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని స్థానిక హైస్కూల్ ఆవరణంలో శనివారం యోగాంధ్ర నిర్వహించారు. తహసీల్దార్ షెక్షావలి, ఎంపీడీఓ నాగేశ్వర్ శాస్త్రి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. యోగ చేయడంవల్ల సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను తమ దినచర్యలో భాగంగా చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కుంచిటి వక్కళిగ సాధికార సమితి కన్వీనర్ పాండురంగప్ప, మండల కన్వీనర్ దాసిరెడ్డి, మార్కెట్‌యార్డ్ చైర్మన్ గురుమూర్తి, ప్రధాన కార్యదర్శి ఈరన్న పాల్గొన్నారు.

గుడిబండ, (ఆంధ్రజ్యోతి): యోగా చేయడంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీఓ కేశవరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రమైన గుడిబండ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి యోగా నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ కళ్యాణ్ చక్రవర్తి, సర్వే డిప్యూటీ తహసీల్దార్ నాగరాజునాయక్, పంచాయతీ కార్యదర్శి ప్రకాశ్ పాల్గొన్నారు.

అమరాపురం, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో యోగాంధ్ర జరిగింది. విద్యార్థులతో కలిసి అధికారులు యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామారావు, ఈఓఆర్డీ సుధాకర్, ఉపాధి హామీ ఏపీఓ శివన్న, యోగా శిక్షకులు నాగభూషణ్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా పారిశుధ్యం

పట్టించుకోని అధికారులు



నగర పంచాయతీ కార్యాలయం సమీపాన చెత్తాచెదారం

మడకశిర టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మడకశిర నగర పంచాయతీ పరిధిలోని 20 వార్డుల్లో పారిశుధ్య పనులకు సంబంధించి అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. డ్రైనేజీలు ఎక్కడపడితే అక్కడ బ్లాక్ అవ్వడంతో పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు కురుస్తుండడంతో కాలనీల్లోకి మురుగు నీరు వస్తోంది. రోడ్డుపై సైతం వర్షపు నీరు నిలబడుతుండటంతో పాదచారులు, ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. మడకశిర నగర పంచాయతీ కార్యాలయం పది అడుగుల దూరంలో సైతం కుప్పలు తెప్పలుగా చెత్తకుప్పలు, ప్లాస్టిక్ పేపర్లు పడి ఉన్నా వాటిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటం పలు విమర్శలకు దారితీస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకుని పారిశుధ్యాన్ని గాడిలోపెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఆదమరిస్తే అంతే...



ప్రమాదానికి నిలయంగా మారిన డివైడర్

పెనుకొండ టౌన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): 44వ జాతీయరహదారిపై నిత్యం వేల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. పెనుకొండ మండలం హరిపురం సమీపంలో పెనుకొండ నుంచి అనంతపురం వైపు వెళ్లే రహదారిలో డివైడర్ దెబ్బతిని రోడ్డుకు అడ్డంగా వచ్చింది. డ్రైవర్లు అప్రమత్తంగా లేకుండా వేగంగా వెళ్లేటప్పుడు డివైడర్‌ను ఢీకొన్ని భారీ రోడ్డు ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి డివైడర్‌కు మరమ్మతులు చేపట్టి యథావిధిగా వేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

స్కాలర్‌షిప్‌నకు ఎంపిక

పెనుకొండ రూరల్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుట్టూరు జడ్పీహెచ్ఎస్‌లో 8వతరగతి చదువుతున్న బిందుల హరి, రచన, యామిని స్కాలర్‌షిప్‌నకు 2024-25 విద్యాసంవత్సరంలో వీరు ఎన్ఎంఎంఎస్ అర్హత పరీక్షలు పాల్గొన్నారు. ఎంపికైన విద్యార్థులను హెచ్ఎం నాగార్జున, పాఠశాల కమిటీ చైర్మన్ సుబ్బరాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉచిత కంటి పరీక్షలు

సోమందేపల్లి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో శనివారం పక్షం సంస్థ ఆధ్వర్యంలో మెగా ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఛత్రపతి శివాజీ యువజన ఆర్గనైజేషన్ ఏర్పాటు చేసింది. ముఖ్య అతిథులుగా ఎస్ఐ రమేష్, దాత వడ్డె సురేష్ కంటి పరీక్షలను చేయించుకున్నారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 200 మందికి నిర్వాహకులు కంటి పరీక్షలు నిర్వహించారు. కేటరాక్ట్ పరీక్ష కోసం 57 మందిని ఎంపిక చేశారు. వీరిని కడపకు చెందిన పుష్పగిరి వైద్యశాలకు తరలించి చికిత్స నిర్వహించనున్నారు. దృష్టిలోపం ఉన్న వారికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వడ్డె వెంకటేశ్, కుర్లపల్లి సురేష్, పక్షం సంస్థ అనంతపురం జిల్లా కార్యదర్శి మల్లికార్జున, జిల్లా కన్వీనర్ పవన్ కుమార్, కోకన్వీనర్ ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

తల్లికి వందనంతో హర్షం

బడుల ప్రారంభంరోజే నగదు జమ

హిందూపురం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎంతమంది చదువుతుంటే వారందరికీ తల్లికివందనం పథకం కింద నగదు ఖాతాలో జమ కావడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో ప్రభుత్వంలో ఇచ్చిన హామీమేరకు సూపర్‌సిక్స్ పథకాల్లో తల్లికి వందనం పథకంతో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి.

చాలా ఆనందంగా ఉంది: నాగమణి, రొద్దం



మాకు నలుగురు పిల్లలు. అందరినీ ప్రభుత్వ బడికి పంపుతున్నాం. పాఠశాల ప్రారంభంలో పిల్లల ఖర్చులుంటాయి. ఈసారి నలుగురు పిల్లలకు రూ.52వేలు తల్లికి వందనం కింద ప్రభుత్వం వేసింది. చాలా ఆనందంగా ఉంది.

నాడు ఒక్కరికి.. నేడు అందరికీ: ఈశ్వరమ్మ, పరిగి



వైసీపీ ప్రభుత్వంలో ఎంతమంది చదువుతున్నా ఒకరికి మాత్రమే అమ్మవడి ఇచ్చారు. కానీ ప్రస్తుతం అలాకాకుండా ఎంతమంది చదువుతున్నా అందరికీ తల్లికివందనం కింద నగదు జమ అవుతుంది. మాకు నలుగురు పిల్లలు. వారికందరికీ తల్లికివందనం నగదు జమ అయ్యింది.

నాయకుల చిత్రపటాలకు క్షీరాభిషేకం



చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

హిందూపురం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): సూపర్‌సిక్స్ పథకాల్లో భాగంగా తల్లికివందనం నగదు జమకావడంతో హిందూపురంలో నాయకుల చిత్రపటాలు క్షీరాభిషేకం చేశారు. శనివారం హిందూపురం పట్టణంలోని నాలుగు సింహాల ఎన్టీఆర్ సర్కిల్‌లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేష్, బాలకృష్ణ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రమేష్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్ మాట్లాడుతూ దేశ చరిత్రలోనే ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు ఎంతమంది పిల్లలు చదువుతున్నా అందరికీ తల్లికి వందనం పేరిట ఖాతాలో నగదు జమ అయ్యిందన్నారు. దీంతో పేద, మధ్య తరగతి కుటుంబాల్లో చదువుకుంటున్న తల్లిదండ్రుల్లో ఆనందం వెల్లివిరుస్తోందన్నారు. ఇచ్చిన మాటను ప్రభుత్వం నిలబెట్టుకుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాఘవేంద్ర, బాచి, అమీన్, నవీన్, కోరుముట్ల నాగేంద్ర, చంద్రమోహన్, డైమండ్‌బాబా, రవీంద్రనాయుడు, బీజేపీ అంజలి, రవితేజారెడ్డి, జనసేన నిమ్మకాయలరాము తదితరులు పాల్గొన్నారు.

గోరంట్లలో...



క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

గోరంట్ల, జూన్14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివాలయం కాలనీలో మహిళలు, పిల్లలు శనివారం సీఎం చంద్రబాబునాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ కన్వీనర్ బాలక్రిష్ణ, నిమ్మల శ్రీధర్, క్రిష్ణమూర్తి, ఉత్తమరెడ్డి, నరేష్, అజంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లిలో...



క్షీరాభిషేకం చేస్తున్న విద్యార్థులు, నాయకులు

సోమందేపల్లి, జూన్14(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రహ్మసముద్రం గ్రామంలో నాయకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు చంద్రబాబు, పవన్‌కల్యాణ్, సవిత ఫొటోలకు క్షీరాభిషేకం చేశారు. ప్రభుత్వం మాట నిలబెట్టుకుందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు.

అర్హులకు న్యాయం చేస్తాం: ఎంఈఓ

రొద్దం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకంలో అర్హులైన ప్రతి విద్యార్థికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎంఈఓ జయభాస్కర్ పేర్కొన్నారు. రొద్దం మండలంలో వేలాది మంది విద్యార్థులకు తల్లికి వందనం పథకం వర్తించిందని అయితే కొన్ని సాంకేతిక కారణాలవల్ల జమకాకపోతే విద్యార్థుల తల్లిదండ్రులు వాటిని సరిచేసుకుంటే పథకం వర్తిస్తుందన్నారు. కొంతమందికి భూమిలేకున్నా పదెకరాలు పైబడి ఉన్నట్లు చూపిస్తోందని, అలాగే చైల్డ్ ఇన్ఫోలో విద్యార్థుల పేర్లు నమోదు కాకపోవడంతో జాబితాలో రాలేదన్నారు. కొంతమంది ఆదాయ ధృవీకరణపత్రాలు సక్రమంగా అందించకపోవడంతో పేర్లు నమోదు కాలేదన్నారు. అలాంటి వారు సచివాలయం, పాఠశాలలను సంప్రదించాలన్నారు. ఏ ఒక్క అర్హత ఉన్నా అన్యాయం జరగకుండా చూసుకుంటామన్నారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించారు. 1వ తరగతి చేరిన విద్యార్థులకు, 10పాసైన విద్యార్థులకు జూలై 5పైనే తల్లికివందనం పడుతుందన్నారు.